
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
7
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 9 ఏప్రిల్ 2024





తిరుపతి ఉప ఎన్నికల్లో ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడ్ వ్యవహారం

పూర్వ మున్సిపల్ కమిషనర్ గిరీషపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రాథమిక నిర్ధారణ వల్లే గతంలో వేటు

లోతుగా విచారించాక ఉత్తర్వుల ఉపసంహరణ

అధికారి నిర్లక్ష్యాన్ని అవకాశంగా తీసుకున్న అధికార పార్టీ నేతలు

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో సస్పెన్షన్‌కి గురైన నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరీషపై ఈసీ సస్పెన్షన్ ఎత్తివేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంలో తొలుత గిరీష సస్పెన్షన్ కూడా ఐఏఎస్ వర్గాల్లో కలకలం రేపింది. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపేసింది. ఈయన తర్వాత వరుసగా పలువురు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు సైతం సస్పెండైన సంగతి తెలిసిందే. ఓవైపు శాఖాపరమైన విచారణ, మరోవైపు పోలీసు దర్యాప్తు జరుగుతుండగానే గిరీషపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీనివెనుక ఏం జరిగిందన్న దానిపై పలు రకాల అభిప్రాయాలు వినిపిస్తుండగా గిరీష పాత్ర, ప్రమేయం లేదని ఈసీ నిర్ధారణకు వచ్చినందునే ఈ నిర్ణయం తీసుకుందని అధికార వర్గాల సమాచారం.

ప్రాథమిక నిర్ధారణ మేరకే..

లోక్‌సభ ఉప ఎన్నికల నాటికి మున్సిపల్ కమిషనర్‌గా ఉండిన గిరీష, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా వ్యవహరించారు. ఈసీ రికార్డుల్లో ఈఆర్వోగా ఆయన పేరే ఉంది. ఎపిక్ కార్డులను భారీ సంఖ్యలో డౌన్‌లోడ్ చేయాలంటే ఈఆర్వో లాగిన్ నుంచే వీలవుతుంది. ఈ కారణంగా ఆయన ప్రమేయం ఉందని ప్రాథమికంగా భావించిన ఎన్నికల కమిషన్ తొలుత ఆయన్ను బాధ్యుడిగా పేర్కొంటూ సస్పెన్షన్ వేటు వేసింది. ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన ఉన్న వారంతా గిరీషనే అధికార పార్టీ నేతలకు సహకరించారన్న అభిప్రాయానికి వచ్చారు.

వాస్తవానికి జరిగిందేమిటంటే..

ఎన్నికల నిబంధనల ప్రకారం షెడ్యూలు విడుదలైతే అప్పటికి సంబంధిత జిల్లాలో మూడేళ్లకు పైబడిన అధికారులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఈ నిబంధన కచ్చితంగా వర్తిస్తుంది. ఆ కోణంలో తిరుపతి ఉప ఎన్నికల షెడ్యూలు వెలువడే నాటికి గిరీష జిల్లాలో నాలుగేళ్లకు పైబడి పనిచేస్తున్నారు. తొలుత రెండేళ్లపాటు జాయింట్ కలెక్టర్‌గా, తర్వాత తిరుపతి కమిషనర్‌గా రెండేళ్ల కలిపి నాలుగేళ్లయింది. అయితే ఆశ్చర్యకరంగా ఆయన జిల్లా నుంచి బదిలీ కాలేదు. ఎన్నికల సమయంలో ఇక్కడే కొనసాగారు. కాకపోతే తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా వ్యవహరించడానికి తాను నిబంధనల రీత్యా అనర్హుడినని అప్పటి కలెక్టర్‌కు గిరీష నివేదించారు. కలెక్టర్ కూడా ఈసీకి సమాచారమిచ్చారు. ఈఆర్వోగా ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని కలెక్టర్‌కు ఈసీ స్వేచ్ఛ ఇచ్చింది. దాంతో మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తుండిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఈఆర్వోగా కలెక్టర్ నియమించారు. ఆమేరకు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో గిరీష పేరు, ఆయన మొబైల్ నెంబరు తొలగించలేదు. సూటిగా చెప్పాలంటే చంద్రమౌళీశ్వర్‌రెడ్డి అనధికారికంగా ఈఆర్వోగా వ్యవహరించారు. సాంకేతికంగా గిరీష బాధ్యత వహించాల్సి వచ్చింది. కొద్దిరోజులు గడిచాక ఈసీ వెబ్‌సైట్‌లో గిరీష అధికారిక మొబైల్ నెంబరు తొలగించి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి నెంబరు నమోదు చేశారు. ఇది ఎలా జరిగిందో అర్థం కావడం లేదు. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ మాత్రమే ఈ మార్పుచేర్పులు చేయగలరు.

సాంకేతిక ఆధారాలతో సంజాయిషీ..

తిరుపతి ఉప ఎన్నికల నాటికి తాను జిల్లాలో నాలుగేళ్లకు మించి పని చేస్తుండిన విషయాన్ని ఈసీ దృష్టికి గిరీష తీసుకెళ్లినట్టు సమాచారం. ఆ విషయమై తాను ఈఆర్వోగా వ్యవహరించడానికి వీల్లేదని నాటి కలెక్టర్‌కు రాసిన లేఖను, కలెక్టర్ ఇదే విషయాన్ని ఈసీకి తెలిపిన లేఖను కూడా ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. ఈసీ వెబ్‌సైట్‌లో తన అధికారిక మొబైల్ నెంబరు కాకుండా చంద్రమౌళీశ్వర్‌రెడ్డి నెంబరు నమోదైన విషయాన్ని కూడా తెలియజేశారు. వీటికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు సమర్పిస్తూ ఉప ఎన్నికల అక్రమాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని సంజాయిషీ ఇచ్చినట్టు తెలిసింది. అప్పటికే లోతుగా విచారించిన ఈసీ సైతం ఈ సంజాయిషీతో సంతృప్తి చెందినట్టు సమాచారం. అందుకే విచారణను పెండింగులో ఉంచి.. సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఎడాపెడా వాడేసుకున్న అధికార పార్టీ నేతలు

వ్యక్తిగతంగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేనప్పటికీ తిరుపతి డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తుండిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డికి అధికార పార్టీ నేతలు చెప్పింది తూచా తప్పకుండా చేసిపెడతారన్న పేరుంది. చెప్పింది నిబంధనలకు విరుద్ధమైనా సరే.. మారు మాట్లాడకుండా చేసే ఆయన నైజం గమనించిన అధికార పార్టీ నేతలు.. ఈఆర్వో లాగిన్ ఐడీని దుర్వినియోగం చేశారు. ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను పెట్టుకుని చంద్రమౌళీశ్వర్‌రెడ్డి లాగిన్ పాస్‌వర్డు తీసుకుని 36వేల ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేయించారు. ఇవేవీ తెలియని ఎన్నికల కమిషన్.. ఈఆర్వో గిరీష కాబట్టి ఆయనే బాధ్యుడిగా సస్పెండ్ చేసింది.

దర్జాగా సూత్రధారులు.. సతమతమవుతున్న పాత్రధారులు

ఎపిక్ కార్డుల వ్యవహారంలో సూత్రధారులైన అధికార పార్టీ నేతలు దర్జాగా తిరుగుతుండగా.. తెలిసి కొందరు, తెలియక కొందరు పాత్రధారులైన అధికారులు మాత్రం ఈసీ చర్యలకు గురై సతమతమవుతున్నారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఈఆర్వోగా నమోదైన పాపానికి యువ ఐఏఎస్ అధికారి గిరీష సస్పెన్షన్‌కు గురికావడంతోపాటు కెరీర్‌లోనూ, ఐఏఎస్ వర్గాల్లోనూ అవమానకర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అలాగే అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి ఈఆర్వో స్థాయిని దుర్వినియోగం చేసినందుకు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. భవిష్యత్తులో క్రిమినల్ చర్యలు కూడా ఎదుర్కొనే అవకాశముంది. తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు సైతం చర్యలకు గురైన సంగతి తెలిసిందే. ఇక కంప్యూటర్ ఆపరేటర్లు పలువురిని తొలగించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ఈసీ చర్యలకు గురి కావడంతో వారి సర్వీసు రిజిస్టర్లలో అవన్నీ నమోదు కానున్నాయి. విచారణ నుంచి బయటపడితే తప్ప భవిష్యత్తులో పదోన్నతులపై కూడా ప్రభావం చూపనుంది. సహచర అధికార, ఉద్యోగ వర్గాల్లో అవమానం మరోటి. పాత్రధారులు ఈ తరహా పరిస్థితులను ఎదుర్కొంటుంటే.. సూత్రధారులైన అధికార పార్టీ నేతలు దర్జాగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. నోరు తెరిస్తే నీతులు, సూక్తులు చెప్పే తిరుపతి కీలక నేత, ఆయన తనయుడు ఈ ఎపిక్ కార్డుల కుంభకోణంలో ప్రధాన సూత్రధారులన్న విషయం బహిరంగ రహస్యంగా మారింది. పోలీసు దర్యాప్తు సక్రమంగా కొనసాగితే సూత్రధారులు నిందితులుగా మారే అవకాశముంది. లేనిపక్షంలో కింది స్థాయి చిరుద్యోగులు బలయ్యే ప్రమాదముంది.

ముసుగు తీసేస్తున్నారు



వైసీపీ సారథ్యంలో వలంటీర్ల రాజీడ్రామాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8: వలంటీర్లు.. ప్రజల సొమ్మును ప్రభుత్వ జీతంగా పొందే వైసీపీ కార్యకర్తలు అనే విషయం ఎన్నికలు దగ్గరయ్యేకొద్దీ బయటపడుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేయడంతో అడ్డగోలుగా వీరిని ఎన్నికల్లో వాడుకోవాలనుకున్న వైసీపీ ఆలోచనలకు గండి పడుతోంది. దీంతో సేవ అనే ముసుగు తొలగించుకుని అధికార పార్టీ సేవకు సై అంటున్నారు. స్వామి భక్తిని చాటుకోవడానికి సిద్ధమవుతున్నారు. తిరుపతి జిల్లాలో వారితో రాజీనామాలు చేయించి ప్రచార కార్యక్రమాల్లో భాగస్వాములు చేసేందుకు అధికార ఎమ్మెల్యే అభ్యర్థులు కుయుక్తులు పన్నుతున్నారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాల్లో ముంచడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వస్తున్నారు. వలంటీర్లతో రాజీనామాలు చేయించి ప్రత్యక్షంగా రాజకీయాల్లో ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటున్నారు. కొంతమంది పరోక్షంగా సహకరిస్తాం రాజీనామాలు చేయమని చెబుతున్నా వారిపై వైసీపీ ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయించి బలవంతంగా విధులకు దూరం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 'ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఈ రెండు నెలలు మేమే ఇస్తాం.. మా వెంట తిరగండి అవసరమైతే అదనంగా సొమ్ములు ఇస్తాం' అని నమ్మించి రంగంలోకి దింపుతున్నారు. వచ్చేది మా ప్రభుత్వమే మళ్లీ మిమ్మల్నే వలంటీర్లుగా నియమించుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఒకవేళ టీడీపీ అధికారంలోకి వస్తే వీరికి భవిష్యత్తు ఉండదని.. కాబట్టి వైసీపీకి అనుకూలంగా ఓటర్ల వద్ద ఓటు వేయించాలని దుష్ప్రచారం చేస్తున్నారు. నమ్మిన వలంటీర్లూ, నమ్మకపోయినా ఒత్తిడికి తలొగ్గినవారూ మూకుమ్మడిగా రాజీనామాలు ఇచ్చేస్తున్నారు. జిల్లాలో సోమవారంనాటికి సుమారు 190మంది రాజీనామాలు చేశారు. ముఖ్యంగా గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, వెంకటగిరి నియోజకవర్గాల్లో అత్యధికమంది రాజీనామా చేశారు. కోట, డీవీ సత్రం, రేణిగుంట, గూడూరు, తడల్లోనూ ఇదే దారి పడుతున్నారు.

స్మార్ట్‌ఫోన్లు ఎక్కడ..?

స్మార్ట్‌ఫోన్లు, సిమ్ కార్డులు, స్కానర్లు ఇవ్వకుండా జిల్లాలో కొంతమంది వలంటీర్లు తప్పించుకుని తిరుగుతున్నారు. నిబంధన ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వాటిని అధికారులకు స్వాధీనం చేయాలి. కానీ కొందరు మాత్రం లెక్కలేనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే లబ్ధిదారుల సమగ్ర సమాచారం వీరి స్మార్ట్‌ఫోన్లలో నిక్షిప్తమై ఉంది. ఎన్నికల్లో ప్రచారానికి వైసీపీకి ఇది బాగా ఉపయోగపడుతుంది. స్వాధీనం చేయని వారి పట్ల అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు ఉన్నాయి.



ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ఎన్నికల్లో హింస, కోడ్ ఉల్లంఘనలు సహించం

కలెక్టర్, ఎస్పీల స్పష్టీకరణ

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో హింస, కోడ్ ఉల్లంఘనలను సహించేది లేదని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో వారిద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ..అధికారుల పని తీరు విషయంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) అసంతృప్తిగా ఉందని చెప్పారు. ఇప్పటిదాకా జిల్లాలో 18మంది వలంటీర్లు, ఒక రేషన్ షాపు డీలరు, ఐదుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని, సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకూ 510 ఫిర్యాదులు అందగా, 390 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామన్నారు. అయినా చర్యల సంఖ్య పెంచాలని ఈసీ నుంచి ఆదేశాలున్నాయని వివరించారు. తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు, బంగారు, వెండి వంటి వస్తువులకు తగిన పత్రాలు చూపితే అవి సహేతుకమైతే అదే రోజే వాటిని విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

ఓటరు జాబితా నుంచి తొలగింపులుండవు

ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఓటరు జాబితా నుంచి ఇకపై తొలగింపులు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈనెల ఒకటోతేదీ నాటికి 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఈనెల 14వ తేదీలోపు తమ ఓటు నమోదుకు మాత్రమే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటు బదిలీ చేసుకునేందుకు కూడా అవకాశముందన్నారు. ఓటర్లు కూడా పోలింగ్ రోజు వరకు వేచి ఉండకుండా, ఇపుడే జాబితాలో తమ పేరు ఉందో లేదో చెక్ చేసుకోవాలని సూచించారు.

మద్యం అమ్మకాలపై నిఘా

మద్యం అమ్మకాలపై నిఘా పెంచినట్టు కలెక్టర్ వెల్లడించారు. మద్యం షాపుల్లో 2013 నుంచి ఏటా ఏప్రిల్ నెలలో జరిగిన అమ్మకాల వివరాలు సేకరించామన్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అమ్మకాల కంటే 30 శాతానికి మించి ఇపుడు అమ్మకాలు జరపడానికి వీల్లేకుండా పరిమితి విధించామన్నారు. ఏ మద్యం షాపులోనైనా 30 శాతానికి మించి అమ్మకాలు జరిగితే ఈసీకి నివేదిస్తామన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి మద్యం అక్రమంగా జిల్లాలోకి రాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

జిల్లాలోని 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తామని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. మొత్తం 2,130 పోలింగ్ కేంద్రాల్లో 671 సమస్యాత్మకం, ఏడు తీవ్ర సమస్యాత్మక కేంద్రాలున్నట్టు గుర్తించామని తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికే జిల్లాకు వచ్చిన నాలుగు కంపెనీల బీఎస్‌ఎఫ్ బలగాలతో ఆత్మస్థైర్యం కల్పించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు, పల్లెనిద్ర చేయిస్తున్నామని వివరించారు. ఇప్పటిదాకా తగిన పత్రాలు లేకుండా రూ.57లక్షలు సీజ్ చేసి, 17 కేసులు నమోదు చేశామన్నారు. మద్యం, బంగారం, వెండి, ఇతర వస్తువులన్నీ కలిపి రూ.3కోట్ల విలువైన సామగ్రి సీజ్ చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకూ పది వేల మందికిపైగా బైండోవర్ చేసుకున్నామని, అందులో ప్రధాన పార్టీలకు చెందిన వారు ఇంచుమించు సమానంగా ఉన్నారన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం) : సా. 6.28
సహరి (బుధవారం) : ఉ. 4.44

బార్ల నుంచి మద్యం కొనుగోళ్లకు వైసీపీ నాయకుల చీటీలు?

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8: ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ దఫా బార్ల నుంచి మద్యం కొనుగోళ్లకు చీటీల విధానాన్ని వైసీపీ నాయకులు అవలంబిస్తున్నట్లు సమాచారం. తిరుపతిలోని 50 శాతం బార్లలో ఇప్పటికే ఈ విధానం అమల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

మేమెందుకు రాజీనామా చేయాలి!

● చంద్రగిరిలో వైసీపీ నాయకులు, అధికారులపై తిరగబడిన వలంటీర్లు

చంద్రగిరి, ఏప్రిల్ 8: తామెందుకు రాజీనామా చేయాలంటూ చంద్రగిరిలో గ్రామ వలంటీర్లు తిరగబడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా.. ఎన్నికల కోడ్ ఉన్నందున విధులలో, రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం వలంటీర్లను ఆదేశించింది. దీంతో వీరిని తమవైపు తిప్పుకోవాలని చంద్రగిరి మండల వైసీపీ నాయకులు పథకం పన్నారు. రోజుకు ఐదుగురు వలంటీర్లను రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం వలంటీర్లను మండల ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లారు. అధికారులు కూడా రాజీనామా చేయాలంటూ ఆదేశించినట్లు సమాచారం. దీంతో కొందరు వలంటీర్లు ఎదురు తిరిగారు. తామెందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించడంతో అధికారులు కంగుతిన్నారు. కాగా, తాము వైసీపీ కార్యక్రమాలలో పాల్గొనేందుకు నాయకులు బెదిరించి రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తున్నట్లు వలంటీర్లు చెబుతున్నారు. రాజీనామా చేసి వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనాలని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటసూర్యసాయిని వివరణ కోరగావలంటీర్లను రాజీనామా చేయాలని ఎవరూ చెప్పలేదన్నారు. అధికారులు ఒత్తిడి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీరు తొలగింపు

వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీ వలంటీర్ శ్రీకాంత్ తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు. మరోపక్క సోమవారం ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు.

ఎండిన పంట పొలాల సందర్శన

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 8: మండలంలో నీరు లేక ఎండిపోయిన వరి పొలాలను తలకోన నీటి సాధన కమిటీ సోమవారం సందర్శించింది. కమిటీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సభ్యుల బృందం కూరపర్తివారిపల్లె పంచాయతీలోని పొలాలను పరిశీలించింది. ఒకటి రెండు నీటి తడులు లేక పంట ఎండిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తలకోన ఏటి నుంచి నీరు మొన్నటి వరకు వృధాగా పింఛానదిలో కలసిపోయిందని పేర్కొంది. స్థానికంగా వర్షపు నీరు లభ్యమైనా ప్రభుత్వ సహకారం లేక రైతులు నష్టపోతున్నారని సభ్యులు చెప్పారు. తలకోన జలాలు స్థానికులకే ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పాముకాటుకు మహిళ మృతి


మృతురాలు కాంతమ్మ

ఎర్రావారిపాలెం,ఏప్రిల్ 8: పాము కరిచి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. స్థానికుల కథనం ప్రకారం నెరబైలు బీసీ కాలనీకి చెందిన పూరేడి సుబ్రమణ్యం కుమార్తె. కాంతమ్మ(48) అవివాహిత. ఈమెకు తల్లిదండ్రులు లేరు. మానసికస్థితి కూడా సరిగా లేదు. బంధువుల దగ్గర ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద ఉన్న కాంతమ్మను పాము కరిచింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ఆమెను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ అయిదు నిమిషాలకే ప్రాణం విడిచింది.

కాలి బూడిదవుతున్న బొమ్మాది కొండ

ఎర్రావారాపాలెం, ఏప్రిల్ 8; శేషాచలంలోని బయో డైవర్సిటీ అటవీ ప్రాంతం కాలి బూడిదవుతోంది. సోమవారం ఉదయం నుంచి బొమ్మాది కొండ కాలుతూనే ఉంది. చామల అటవీ రేంజి పరిధిలోని ఈ కొండ అరుదైన వృక్షాలకు, జంతుజాల నివాసానికి నిలయం. ఫారెస్ట్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈత సరదాకు నిండుప్రాణం బలి

స్వర్ణముఖి నదిలో మునిగిపోయి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి


అఖిల్(ఫైల్ ఫొటో)

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8: స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లిన ఓ పాలిటెక్నిక్ విద్యార్థి స్వర్ణముఖి నదిలో మునిగిపోయి.. మృతి చెందాడు. నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న మధు, సుహాసిని దంపతుల కుమారుడు అఖిల్(15) ఓ ప్రైవేటు పాలిటెక్నిక్‌లో డిప్లొమా ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం స్నేహితులతో కలసి నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలోకి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లాడు. అందరూ ఈత కొడుతుండగా ఉన్నట్టుండి అఖిల్ నదిలో మునిగిపోయాడు. భయపడ్డ స్నేహితులు విషయాన్ని కాలనీవాసులకు తెలిపారు. వారు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు నది వద్దకెళ్లి అఖిల్ కోసం గాలించారు. చీకటిపడే సమయానికి అఖిల్ మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చెవిరెడ్డి హయాంలో ప్రగతి తిరోగమనం

● ఉమ్మడి కూటమి సమన్వయ సమావేశంలో పులివర్తి నాని


సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

చంద్రగిరి, ఏప్రిల్ 8: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పదేళ్ల పాలనలో చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిపరంగా ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని దోపిడీదారులు పాలిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కుటుంబం సహజ సంపదను దోచి, మఠం భూములు, ప్రభుత్వ భూములు, కబ్జా చేసి వేల కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్‌డీఏతో పొత్తు పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ విజయంలో మిత్రపక్షాల పాత్ర కీలకమైందన్నారు. సీనియర్లను గౌరవిస్తూ కొత్తవారిని ప్రోత్సహిస్తూ సమన్వయంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, పాకాల జడ్పీటీసీ నంగా పద్మజా బాబురెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, చిన్నగొట్టిగల్లు వైస్ఎంపీపీ సునిత దామోదరాలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమాంబరధరరావు, సీఆర్ రాజన్, సుబ్రహ్మణ్యంనాయుడు, వలపల దశరథనాయుడు, కుమారరాజారెడ్డి, శివకోటిరెడ్డి, రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, నీలకంఠచౌదరి, హరిప్రసాద్, విజయకుమార్, బెల్లంకొండ మురళి, శ్రీధర్‌నాయుడు, సింగు సుధా, బీజేపీ నాయకులు మునిగంగిరెడ్డి, వెంకటముని, సుబ్రమణ్యంయాదవ్, మేడసాని పురుషోత్తంనాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరిక



చంద్రగిరి మండలంలోని గంగుడుపల్లె పంచాయతీ, శ్రీనివాసమంగాపురం నుంచి 50 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వీరికి పులివర్తి నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● చంద్రగిరి పంచాయతీ బీడీ కాలనీలోని రోషన్ మసీదులో సోమవారం ఇఫ్తార్ విందులో నాని పాల్గొన్నారు.

అభివృద్ధిలో అట్టడుగున అవిలాల

● టీడీపీ మహిళానేత సుధారెడ్డి


మాట్లాడుతున్న సుధారెడ్డి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 8: అవిలాల గ్రామ పంచాయతీని అభివృద్ధిలో అట్టడుగు స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికే దక్కిందని నియోజకవర్గ టీడీపీ మహిళానేత పులివర్తి సుధారెడ్డి విమర్శించారు. గ్రామ పరిధిలో మహిళాశక్తికి అండగా పేరిట సోమవారం అవిలాల పంచాయతీ, వినాయకనగర్ మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, కూరగాయల మార్కెట్, ఇళ్లపట్టాలు, తాగునీటి సమస్య, దోమల బెడద, చక్రగార్డెన్స్ కాలనీ స్మశానవాటిక వంటి సమస్యలను మహిళలు తన దృష్టికి తెచ్చారని ఆమె వివరించారు. నానికి ఒక అవకాశం ఇచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా బలపరిస్తే ప్రతిసమస్యకూ పరిష్కారం చూపుతారన్నారు.

నాని విజయానికి సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 8: ఎన్నికల్లో పులివర్తి నాని గెలుపే ధ్యేయంగా సమష్టిగా పనిచేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి కోరారు. నెత్తకుప్పం టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జేడీ జగన్ మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యేగా నానిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామన్నారు. జిల్లా నాయకులు జనార్దన్ చౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, డిల్లీనాథరెడ్డి, హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, ధనంజయరెడ్డి,మండల నాయకులు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసం వచ్చాం... ఆశీర్వదించండి


చంద్రబాబునాయుడు కాలనీలో వరప్రసాద్, విజయశ్రీ ప్రచారం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8: ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చామని... తమను ఆశీర్వదించాలని తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ముందుగా కాలనీ ముఖద్వారం వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ముఖ్యమంత్రి జగన్ తన ముద్రవేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నేతలు రఫీ, గూడూరు ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, షైలారి రాజశేఖర్, వేమసాని శోభన్‌నాయుడు, నిత్య కృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, అత్తికాయల సుబ్రహ్మణ్యం, దార్ల రాజేంద్ర, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్, సుజాతమ్మ, శివకుమార్‌రెడ్డి, సుబ్బారావు, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమన్వయంతో కృషి



గూడూరు, ఏప్రిల్ 8: ఎన్డీఏ కూటమి విజయానికి కృషి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులందరూ సమన్వయంతో పనిచేసి చేద్దామని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు అన్నారు. సోమవారం గోగినేనిపురంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు మాట్లాడుతూ వైసీపీలో దళితులకు తగిన గౌరవం ఇవ్వడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, కిషోర్‌నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, మోహన్, శివ, క్రాంతి, బాలసుబ్రహ్మణ్యం, భైరప్ప, గాలి ప్రకాష్‌నాయుడు, మట్టం శ్రావణి, భారతి, గోను శివకుమార్, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి సాక్షాత్కారం


ఉభయదేవేరిలో తిరుచ్చిపై సుందరరాజస్వామి

తిరుచానూరు, ఏప్రిల్ 8: తిరుచానూరులోని సుందరరాజస్వామికి సోమవారం ఘనంగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం చేశారు. సాయంత్రం సర్వాలంకార శోభితులైన భూదేవి, శ్రీదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు, మధు,. శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 8: క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏపై ఆక్రమణదారుని దాడి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వీఆర్వోలు

చంద్రగిరి, ఏప్రిల్ 8: ప్రభుత్వ భూమిలో సర్వేకు వెళ్లిన వీఆర్ఏపై ఆక్రమణదారుడు దాడి చేశాడు. పోలీసుల కథనం ప్రకారం పుల్లయ్యగారిపల్లె లెక్కదాఖల్లోని సర్వే నెంబర్ 14లో రస్తా పొరంబోకు స్థలాన్ని సర్వే చేయడానికి సోమవారం రెవెన్యూ అధికారులు, వీఆర్ఏ శేషాద్రి వెళ్లారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను తొలగించి బయలుదేరుతుండగా బందార్లపల్లెకు చెందిన జయకుమార్ ఈస్థలం తనదేనంటూ రెవెన్యూ అధికారులను అడ్డుకున్నాడు. వీఆర్ఏ శేషాద్రిపై దాడి చేశాడు. దీంతో వీఆర్వోలతో కలిసి వీఆర్ఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై జానకిరాముడు

● నేడు గరుడసేవ


సర్వభూపాల వాహనం


కల్పవృక్ష వాహనం

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 8: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు స్వామివారు కల్పవృక్ష వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. 10 నుంచి 11.30 వరకు సీతా లక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 8.30 వరకు సర్వభూపాల వాహన సేవ జరిగింది. వాహన సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమల పెద్ద జీయర్, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో, శ్రీరామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద నిర్వహించిన సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మంగళవారం ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు.

తిరుమలలో ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే


ఆర్మీ చీఫ్‌కు స్వాగతం పలుకుతున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని ఫీనిక్స్(శ్రీవేంకటేశ్వర నిలయం) అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, మనోజ్ పాండే మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా : ఆరణి

తిరుపతి (ఆటోనగర్)ఏప్రిల్ 8: నగర వాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం వినాయకసాగర్‌లో వాకింగ్ చేస్తున్న వారితో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు సుబ్బరామయ్య, జి.రవి, బాలాజీ నాయుడు, శివారెడ్డి పాల్గొన్నారు.

రుయా ఉద్యోగి సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 8 : ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన రుయా ఉద్యోగిని రెండు రోజుల కిందట రుయా అధికారులు కడపకు సరెండర్ చేయగా తాజాగా అతన్ని సస్పెండ్ చేస్తూ డీఎంఈ నరసింహులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రుయాలో అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి ఉమామహేశ్వరావు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గత నెలలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును కలిసిన విషయంపై అదే నెలలో ఆంధ్రజ్యోతిలో కోడ్‌ను ఉల్లంఘించిన రుయా ఉద్యోగి శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణ చేపట్టి రెండు రోజుల కిందట ఆయన్ను సొంత పోస్టింగ్ అయిన కడప రిమ్స్‌కు సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా సస్పెండ్ చేశారు. విచారణ ముగిసే వరకు ఊరు విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దేశం వెలిగిపోవడం లేదు

● పాలకుల గోబెల్స్ ప్రచారంతో జాగ్రత్త
● ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్



సదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

తిరుపతి సెంట్రల్, ఏప్రిల్ 8 : పాలకులు చెబుతున్నట్లు దేశం వెలిగిపోవడం లేదని, ఆర్థికంగా చితికిపోతోందని ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ వెల్లడించారు. తిరుపతి యశోధనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం దేశం వెలిగిపోతుందా అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో జనాభాకు తగినట్లు ఆర్థికపరమైన అంశాలలో అభివృద్ధి లేదన్నారు. విద్యారంగంలో నైపుణ్యాలను పెంచుతున్నట్లు ప్రకటిస్తున్నారే తప్ప ఆచరణలో ఉండడం లేదని విమర్శించారు. నైపుణ్యమున్న విద్యావంతులు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఉపాధి కూలీలకు కేటాయించిన ఏడాది బడ్జెట్ ఆరు నెలలకే సరిపోతోందని, మిగిలిన ఆరునెలలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. 2014లో 31శాతం మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురాగా ఇప్పుడు అది 19 శాతానికి పడిపోయిందని వివరించారు. దేశంలో పది సంవత్సరాలుగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఆర్థికంగా దేశం 140వ స్థానంలో ఉందన్న విషయాన్ని పాలకులు గుర్తించుకోవాలన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, సోమ్ ప్రకాష్, హేమచంద్రారెడ్డి, దామోదరం చితికిపోతున్న ఆర్థిక పరిస్థితి గురించి వివరించారు.

రేషన్‌కు సర్వర్ కష్టాలు

● కార్డుదారులకు తప్పని పడిగాపులు


రేషన్ షాపు వద్ద కార్డుదారుల పడిగాపులు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 8 : రెండు రోజులుగా సెంట్రల్ సర్వర్ పని చేయకపోవడంతో రేషన్ కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి షాపుల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. నగరంలో 102 చౌక దుకాణాలున్నాయి. ఇవి కాకుండా మొబైల్ డిస్ట్రిబ్యూషన్ వాహనాల ద్వారా కొన్ని ప్రాంతాల్లో సరుకులు పంపిణీ చేస్తున్నారు. రెండు రోజులుగా సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ఈ-పోస్ మిషన్‌లో వేలి ముద్రపడడానికి అరగంట నుంచి 45 నిమిషాలు పడుతోంది. ఏపీ, తెలంగాణాకు కలిపి సెంట్రల్ సర్వర్ సిస్టమ్ హైదరాబాదులో ఉండడంతో రెండు రాష్ట్రాల్లో రేషన్ పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని డీలర్లు అంటున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8: జిల్లాలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం వెలగపూడి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ వివరిస్తూ ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సరఫరా ఇబ్బందులపై 0877-2256766కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, అధికారులు పాల్గొన్నారు.

మెజార్టీ పెంపే లక్ష్యం కావాలి

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జుల సమావేశంలో ఆరణి శ్రీనివాసులు - జనసేనలో భారీగా చేరికలు



టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జుల సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఓటమి భయంతో వైసీపీ నేతలు కొంతమంది అధికారులను అడ్డం పెట్టుకుని గెలవాలని చూస్తోందని, అది జరిగే పనికాదని కూటమి తరపున బరిలో ఉన్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, పుష్పావతి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం రెండుచోట్ల ఆయా డివిజన్ నాయకులతో అభ్యర్థి పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ మూడు పార్టీల కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సాగితే తిరుపతి నియోజకవర్గంలో కూటమి జెండాలు రెపరెపలాడటం ఖాయమన్నారు. పొత్తుల్లో భాగంగా తిరుపతిని జనసేనకు కేటాయించారని, గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనని, కమలం గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా వరప్రసాద్‌ని గెలిపించాలని కోరారు. అభినయ్ రెడ్డిని చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరిసంహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, కేవీ రమణ, బీజేపీ నుంచి పొనగంటి భాస్కర్, శేఖర్, విజయ్, వెంకటేష్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, రాజా రెడ్డి పాల్గొన్నారు.



జనసేనలోకి వైసీపీ నేతల చేరికలు

జనసేనలో చేరికలు.. : జనసేనాని పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి వైసీపీ నుంచి ఆళ్వారు మురళి నాయకత్వంలో రెండు వందల కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఆరణి శ్రీనివాసులు పార్టీ కండువా కప్పి వారిని జనసేనలోకి ఆహ్వానించారు. ఆళ్వారు మురళి లాంటి నాయకులు జనసేనలోకి రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో శైలు, రవీంద్ర, గురవయ్య, మధు, రాజేంద్ర, కృష్ణమూర్తి, బండ్ల లక్ష్మీపతి, సరోజమ్మ, భారతి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 133 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 8: జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షకు సోమవారం 133 మంది గైర్హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ టికైలాష్‌నాథ్ చెప్పారు. 1,413 మంది దరఖాస్తు చేసుకోగా 1,280 మంది హాజరయ్యారని వెల్లడించారు.

నేడు మహతిలో ఉగాది వేడుకలు

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 8: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం సంయుక్తంగా మంగళవారం క్రోధి నామ ఉగాది వేడుకలను నిర్వహించనున్నాయి. ఉదయం 9.30 గంటలకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల సిబ్బంది మంగళవాయిద్య గోష్ఠి ఉంటుంది. ఉన్నత వేద విద్యాపరిషత్ వారి వేదాశీర్వాదం ఉంటుంది. 10 గంటలకు వేదాంతం విష్ణుభట్టాచార్య పంచాంగ శ్రవణం చేస్తారు. శతావధాని ఆముదాల మురళి అవధాన కార్యక్రమం నిర్వహిస్తారు. తెలుగు వైతాళికులు విచిత్ర వేషధారణ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం వివిధ సాహిత్య కళా పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు. చివరిగా ఉగాది పచ్చడి వితరణ ఉంటుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 73,801 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,055 మంది తలనీలాలు సమర్పించారు.

ఇంటర్వ్యూ



చిత్తూరు పార్లమెంటు బరిలోకి హఠాత్తుగా ప్రవేశించారు ఆయన. అయితే ఆ నిర్ణయం మాత్రం హఠాత్తుగా తీసుకున్నది కాదు. ఉన్నతోద్యోగిగా సుదీర్ఘకాలపు అనుభవం.. లాభదాయకమైన సంస్థ నిర్వహణలో పొందుతున్న సంతృప్తి.. ఊరిని వేదికగా చేసుకుని చేస్తున్న సేవా కార్యక్రమాలు.. వీటి నుంచి పుట్టిన ఆలోచనే ఆయనను రాజకీయాల్లోకి నడిపింది. ప్రజాసేవకు అధికారం బలమైన ఆలంబన అవుతుందంటూ కుమారుడు ఇచ్చిన సూచన ఆయన్ను చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దించింది. నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ, ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, పరిష్కార లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ప్రయాణం సాగిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పంచుకున్న అంశాలు ఇవి...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చంద్రబాబు విజన్ చూసే రాజకీయాల్లోకి..

టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్

టీడీపీలో చేరేందుకు కేవలం చంద్రబాబే కారణం. దశాబ్దాలుగా ఆయన్ను, ఆయన పాలనను, అందులో ఆయన విజన్‌ను చూస్తున్నా. విజన్ 2020 అని చంద్రబాబు అన్నప్పుడు అందరూ నవ్వారు. దాన్ని ఆయన నిజం చేసి చూపించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాఫ్ట్‌వేర్ రంగంపై ఆధారపడనుందని అప్పట్లోనే గుర్తించి హైటెక్ సిటీని అభివృద్ధి చేశారు. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో చంద్రబాబును మించినవారు లేరు.

చిత్తూరుకు చంద్రబాబే పంపించారు..

బ్యాంకు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు నేనూ టీడీపీ పార్టీలో చేరుతానని నా ప్రొఫైల్ అందించాను. చంద్రబాబు నుంచి ఎలాంటి హామీ పొందకుండానే నా సొంత పార్లమెంటు నియోజకవర్గం బాపట్లలో టీడీపీ కోసం గట్టిగా పనిచేశాను. నాకు లభిస్తున్న ఆదరణ చూసి పోటీ చేద్దామనే నమ్మకం కలిగింది. ఆ తర్వాత చంద్రబాబును కలిసి బాపట్ల ఎంపీ టికెట్ అడిగాను. ఆయన నన్ను చిత్తూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేయమని పంపించారు.

రాజకీయాల్లోకి వచ్చినవారి మీద ప్రజలకు ఒక బలమైన అభిప్రాయం ఉంటుంది. అదేంటంటే.. వీళ్లు డబ్బులు సంపాదించుకోవడానికే వచ్చారని. నాకు ఆ అవసరం లేదు. ఉన్నత ఉద్యోగిగా హోదా అనుభవించాను. డబ్బులు చూసేశాను. నా మీద ఆధారపడినవారు లేరు. కొడుకు స్వతంత్రంగా ఎదిగాడు. ప్రజలకు మంచి చేద్దామనే ఒకే ఒక్క ఆలోచన నాది. ఆచరణకు అధికారం బలాన్నిస్తుందనే నమ్మకంతోనే ఎంపీగా పోటీ చేస్తున్నాను.

అనేక ప్రాంతాల్లో అధికారిగా..

ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటులో హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, పూణె, ఔరంగబాద్, లాతూర్, ఉస్మానాబాద్, నాందేడ్, బెంగుళూరు, గుల్బర్గా వంటి ప్రాంతాల్లో పనిచేశారు. మూడేళ్ల సర్వీసు ఉండగానే గుల్బర్గాలో ముందస్తు పదవీ విరమణ తీసుకున్నాను.

'పే బ్యాక్ టూ సొసైటీ'

మూడు నెలల కిందట వరకూ కూడా నేను రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. 'పే బ్యాక్ టూ సొసైటీ' అనే మాట సర్వీసులో చేరినప్పటి నుంచీ నా మనసులో నాటుకుపోయింది. మా గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, లైబ్రరీ ఏర్పాటు, అనారోగ్యంతో బాధపడేవారికి, అవసరమున్నవారికి ఆర్థిక సాయం చేయడం వంటివి చేసేవాడిని. చదువుకున్న వారికి శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు వచ్చేలా చేసేవాడిని. అలా ఉద్యోగాలు పొందినవారిలో సుమారు 20 మంది ఉన్నత హోదాల్లో ఉన్నారు. 2009లో ఓ అబ్బాయికి రూ.7 వేల జీతానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించాను. ఇప్పుడతను రూ.3.50 లక్షల జీతాన్ని డ్రా చేస్తున్నాడు. నేను ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా ఉన్నప్పుడు పెద్ద పెద్ద పరిశ్రమలతో సంబంధాలుండేవి. వాటి ద్వారా నేను ఉద్యోగాలకు సిఫార్సు చేసేవాడ్ని.

సేవ కోసం రాజీనామా

చిన్న స్థాయిలో చేసే సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేందుకే ఉద్యోగానికి రాజీనామా చేశాను. అప్పటికే నా కొడుకు రాధే నిర్మాణ రంగంలో మంచిగా స్థిరపడి ఉన్నాడు. అతన్ని సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవ్వమని చెప్పాను. గజియాబాద్ ఐఎంటీ బిజినెస్ కాలేజీలో చదివిన ఆయన బయటికి వచ్చిన వెంటనే వ్యాపారం చేస్తానన్నాడు. నా నుంచి ఆర్థిక అండ కూడా లేకుండానే స్వతంత్రంగా నిర్మాణ రంగంలో అడుగు పెట్టి ఇప్పుడు పెద్ద స్థాయిలో స్థిరపడ్డారు. ఉద్యోగం మానేసి తన నిర్మాణ కంపెనీలోకి రమ్మని రాధే నన్ను ఆహ్వానించారు. రాజీనామా చేశాను. ఇప్పుడు మా సంస్థ మంచి పురోగతి చెందింది.

ఐదేళ్లలో రాజధాని ఎలా సాధ్యం

సాధారణంగా ఓ కొత్త రాజధాని నిర్మాణానికి 25 నుంచి 30 ఏళ్లు పడుతుంది. డిజైన్ ఆరేడు ఏళ్లు, నిర్మాణానికి 20-25 ఏళ్లు అవసరం. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్, ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రా నగరాల నిర్మాణం ఓ ప్లాన్ ప్రకారం జరిగింది. అలాంటిది మన రాష్ట్రనూ తన రాజధాని అమరావతిని నాలుగైదు ఏళ్లలో నిర్మించలేదని ఆయన్ను దించేశాం. మనమంతా విజ్ఞతతో ఆలోచించలేదు. ఇదే అదునుగా కొత్త సీఎం మూడు రాజధానులు అన్నారు. చివరికి రాష్ట్ర ప్రజలంతా రాజధాని లేనివాళ్లం అయిపోయాం.

ఎంపీ అభ్యర్థికి లోకల్, నాన్‌లోకల్ ఉండదు

చిత్తూరు నాన్ లోకల్ అవుతుందేమోనని చంద్రబాబును అడిగాను. ఎంపీ అభ్యర్థికి నాన్‌లోకల్ ఏంటన్నారు ఆయన. అప్పటికే వైసీపీ బాపట్ల ఎంపీగా గెలిచిన నందిగామ సురేష్ నాన్‌లోకల్. బాపట్లలో ఎప్పుడూ ఏ పార్టీ నుంచి లోకల్ అభ్యర్థి బరిలో లేడు. నరసరావుపేటలో వైసీపీ నుంచి ఎంపీగా బరిలో ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ కూడా నాన్ లోకల్. ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడ నాన్‌లోకల్.

జిల్లా ప్రజలు నన్ను సొంతం చేసుకున్నారు

చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, అమర్నాథ్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, మురళీమోహన్, థామస్.. ఇలా అందరూ తమ సొంత మనిషిలా నన్ను రిసీవ్ చేసుకున్నారు. చిత్తూరు జగన్మోహన్ అయితే తనతో పాటు నన్ను నేరుగా ప్రచారంలోకి తీసుకెళ్లిపోయారు. కుప్పంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా అన్ని సమావేశాలు, సభల్లో ఆయన నన్ను పరిచయం చేశారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించి ప్రచారాల్లో పాల్గొన్నాను. అందరు ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం చేసుకుని ఎన్నికలకు ఏం అవసరమో ఆ దిశగా కృషి చేస్తున్నాను. బీజేపీ, జనసేన నాయకులు నన్ను మరింతగా సొంతం చేసుకున్నారు.

సమస్యలేమిటో గుర్తించా

చిత్తూరు పార్లమెంటు పరిధిలో ప్రజల సమస్యల్ని ఇప్పటికే గుర్తించాం. చేనేతల సమస్యలు, పట్టు రైతుల ఇబ్బందులు, గ్రానైట్ పరిశ్రమల కష్టాలు, పండ్లు, కూరగాయల రైతుల అవసరాలన్నీ గుర్తించాం. గెలిచి వాటి పరిష్కారానికి కృషి చేయాలి.

పెన్షన్లపై జగన్ అబద్ధాలు

ఖజానాలో డబ్బుల్లేక పెన్షన్లను ఇవ్వలేదు. పైగా టీడీపీ మీద బురద జల్లుతున్నారు. జగన్ నియంతృత పరిపాలన చేస్తున్నాడు. రాష్ట్రంలో ఏం జరిగినా ఎవరెలా పోయినా అధికారం మాత్రం నాకే కావాలనే మనస్తత్వం కలిగినవారు. ఎంత మందినైనా తొక్కేసి అయినా నేను గెలవాలనుకునేవారు అధికారంలోకి వస్తే ప్రమాదం.

నాకెందుకు ఓటేయాలంటే..

ప్రస్తుత ఎంపీ రెడ్డప్ప ఐదేళ్లలో ఏం చేశారనేది జనాలకు తెలుసు. కొత్తవాడిని.. నా గురించి ఏమీ తెలియదు. నన్ను నమ్మి మాత్రమే ప్రజలు ఓటేయాల్సి ఉంది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. నిత్యం అందుబాటులో ఉంటాను. పార్లమెంటులో గళాన్ని వినిపిస్తా. నేను పనిచేయకుంటే నిలదీయండి. కమ్‌డౌన్ అని నన్ను అడ్డుకోండి.

రాజకీయాలు.. మా అబ్బాయి ఆలోచనే

కంపెనీలో చేరాక సీఎస్ఆర్‌లో భాగంగా సామాజిక కార్యక్రమాలు చేసేవాడ్ని. మనం చేసే సామాజిక కార్యక్రమాలకు ప్రభుత్వం తోడైతే మరిన్ని అద్భుతాలు చేయొచ్చని మా అబ్బాయి అనేవాడు. ఆ ఆలోచనే నన్ను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది.



డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను

చదువుకుని వచ్చాను, ఉన్నత ఉద్యోగం చేశాను, పెద్ద స్థాయిలో వ్యాపార రంగంలో రాణిస్తున్నాను. నాకున్న లక్ష్యం వేరే వాళ్లకు ఉండాలనేం లేదు. ఇతరులతో నన్ను పోల్చుకోలేను. గెలిచాక నేను మాత్రం డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను. పార్లమెంటులో హాజరు నమోదుకే పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి పోరాడుతాను. అన్ని రంగాల పట్ల నాకు అవగాహన ఉంది.

జగన్ గెలిస్తే డ్రగ్స్‌లో పంజాబ్‌ను మించిపోతాం

సీఎం జగన్‌కు పరిపాలన అనేది తెలియదు. అడ్మినిస్ట్రేషన్ జీరో అని చెప్పవచ్చు. ఈ ప్రభావం యువత మీద పడింది. యువతకు ఉద్యోగాలు లేవు. చదువుకున్నవాడు కూలి పనులకు పోలేడు. చెడు వ్యసనలకు అలవాటు పడుతాడు. అందుకే రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, నాసిరకం మద్యం విచ్చలవిడిగా ఉన్నాయి. పంజాబ్ యువత కూడా ఇలానే డ్రగ్స్‌కు అలవాటు పడింది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని కాపాడుకోలేక పోతున్నారు. ఆ పరిస్థితి మనకూ ప్రారంభమైంది. మళ్లీ జగన్ గెలిస్తే మాత్రం మన రాష్ట్రం పంజాబ్‌ను మించి పోతుంది. ఇక ఆర్థిక పరిస్థితి తెలిసిందే. రాష్ట్రంలో ఆరేడు లక్షల కోట్ల రూపాయల అప్పు ఉంది. ఒకప్పుడు తలసరి ఆదాయం గురించి చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు తలసరి అప్పు గురించి చెప్పుకునే స్థితికి తెచ్చారు. జగన్‌ను కంటిన్యూ చేస్తే జీవితాలను కోల్పోతారు.

ప్రజాసేవ కోసం వచ్చాం... ఆశీర్వదించండి




చంద్రబాబునాయుడు కాలనీలో వరప్రసాద్, విజయశ్రీ ప్రచారం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8: ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చామని.. తమను ఆశీర్వదించాలని తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ముందుగా కాలనీ ముఖద్వారం వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ముఖ్యమంత్రి జగన్ తన ముద్రవేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నేతలు రఫీ, గూడూరు ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, మైలారి రాజశేఖర్, వేమసాని శోభన్‌నాయుడు, నిత్య కృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, అత్తికాయల సుబ్రహ్మణ్యం, దార్ల రాజేంద్ర, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్, సుజాతమ్మ, శివకుమార్‌రెడ్డి, సుబ్బారావు, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమన్వయంతో కృషి

గూడూరు, ఏప్రిల్ 8: ఎన్డీఏ కూటమి విజయానికి కృషి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులందరూ సమన్వయంతో పనిచేసి చేద్దామని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు అన్నారు. సోమవారం గోగినేనిపురంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు మాట్లాడుతూ వైసీపీలో దళితులకు తగిన గౌరవం ఇవ్వడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, శీలం



కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, కిషోర్‌నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, మోహన్, శివ, క్రాంతి, బాలసుబ్రహ్మణ్యం, భైరప్ప, గాలి ప్రకాష్‌నాయుడు, మట్టం శ్రావణి, భారతి, గోను శివకుమార్, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ పాలిటిక్స్ ఏమిటి సార్లూ?

- వైసీపీ నేతలు మాత్రం ఇందుకు అతీతులా..
- ఎన్నికల నిర్వహణలో నిష్పక్ష అధికారులకు చోటు కల్పించాలి
- ఎన్డీఏ ఉమ్మడి సమన్వయ సమావేశం తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం విపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం, అవి సరిపోక ఇప్పుడు బైండోవర్ కావాలని నోటీసులు పంపడాన్ని తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్డీఏ నేతలు ఖండించారు. సోమవారం ఓ ప్రైవేట్ హోటల్లో ఎన్డీఏ కూటమి ఉమ్మడి సమన్వయ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమావేశం తీర్మానం చేసింది. ముందుగా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ విపక్ష నాయకులకు బైండోవర్ నోటీసులిచ్చి భయపెట్టాలని చూస్తున్నారని, అదేవిధంగా ఎంత మంది వైసీపీ నాయకులకు నోటీసులు పంపారో పోలీసు అధికారులు మీడియాకు విడుదల చేయాలని డిమాండు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, ఇతర ప్రాంతాల్లో నివసించే ఓటర్లు కలవడం వంటి వివిధ అంశాలపై మూడు పార్టీల నాయకులతో కలసి ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ నేతల అరాచకపాలనకు స్వస్తిపలికేలా కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటేనే రాష్ట్ర భవిష్యత్తుకు మార్గం సుగమమం అవుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థులను గెలిపించడానికి మూడు ముఖ్య పార్టీలతో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసుకుని తద్వారా ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలని ఈ సమావేశం తీర్మానించింది. అదేవిధంగా బైండోవర్ నోటీసులపై కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు సజావుగా జరగడానికి నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులకు చోటు కల్పించి, అధికార పార్టీకి అడుగులకు మడుగులొత్తుతున్న అవినీతి అధికారులను తొలగించాలని సమావేశం డిమాండు చేసింది. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, విజయలక్ష్మి, ఆనంద్ గౌడ్, బీజేపీ నేతలు శాంతారెడ్డి, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, పొనగంటి భాస్కర్, మునిసుబ్రమణ్యం, జనసేన నాయకులు రాజారెడ్డి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై బైండోవర్ కేసులు.. సొంత పూచీకత్తుపై విడుదల


తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8 : పాత కేసులు తిరగతోడి టీడీపీ నాయకులపై పోలీసులు బైండ్ ఓవర్ కేసులు నమోదు చేస్తున్నారు. సోమవారం ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు పాత కేసులున్న పలువురు టీడీపీ నేతలను స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి, తహసీల్దార్ ఎదుట హాజరుపరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఇందులో పార్టీ నగర అధ్యక్షులు ఒట్టికుంట శంకర్, బాలయ్య, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద గౌడు, క్రిస్టియన్ సెల్ నగర అధ్యక్షుడు రవీంద్రబాబు డానియల్ ఉన్నారు. ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒట్టికుంట శంకర్, ఆనందగౌడు మాట్లాడుతూ తిరుపతిలో ఐదేళ్లుగా ప్రజాస్వామ్యం మంటకలసిందన్నారు. దొంగోట్లు రాజ్యమేలుతున్నాయని, పోలీసులు వైసీపీకి తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శించారు.

మేమెందుకు రాజీనామా చేయాలి!

చంద్రగిరిలో వైసీపీ నాయకులు, అధికారులపై తిరగబడిన వలంటీర్లు

చంద్రగిరి, ఏప్రిల్ 8: తామెందుకు రాజీనామా చేయాలంటూ చంద్రగిరిలో గ్రామ వలంటీర్లు తిరగబడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా.. ఎన్నికల కోడ్ ఉన్నందున విధులలో, రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం వలంటీర్లను ఆదేశించింది. దీంతో వీరిని తమవైపు తిప్పుకోవాలని చంద్రగిరి మండల వైసీపీ నాయకులు పథకం పన్నారు. రోజుకు ఐదుగురు వలంటీర్లను రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం వలంటీర్లను మండల ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లారు. అధికారులు కూడా రాజీనామా చేయాలంటూ ఆదేశించినట్లు సమాచారం. దీంతో కొందరు వలంటీర్లు ఎదురు తిరిగారు. తామెందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించడంతో అధికారులు కంగుతిన్నారు. కాగా, తాము వైసీపీ కార్యక్రమాలలో పాల్గొనేందుకు నాయకులు బెదిరించి రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తున్నట్లు వలంటీర్లు చెబుతున్నారు. రాజీనామా చేసి వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనాలని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటసూర్యసాయిని వివరణ కోరగావలంటీర్లను రాజీనామా చేయాలని ఎవరూ చెప్పలేదన్నారు. అధికారులు ఒత్తిడి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

టీటీడీ జేఈవోగా గౌతమి



తిరుమల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి నియమితులయ్యారు. ఈమేరకు ఈమెను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో గౌతమిని నియమించారు. గౌతమి.. 2007-09 వరకు చిత్తూరు జిల్లాలో ప్రొబేషనరీ అధికారిగా, 2012 వరకు అనంతపురం ఆర్డీవోగా, 2015 వరకు నెల్లూరు డ్వామా పీడీగా, 2019 వరకు టీటీడీ డిప్యూటీ ఈవోగా, 2022 వరకు కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 2023 వరకు తిరుపతి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవోగా, ఆ తర్వాత అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

పుత్తూరు వార్తలు

ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 8: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యుడు ధనుష్ సూచించారు. సోమవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తరచూ రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శారీరక వ్యాయామం తప్పనిసరని, నడకను అలవాటు మార్చుకోవాలన్నారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ద్రవపదార్థాలు తీసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో హెడ్ నర్స్ దిల్‌షాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 8: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య నివారణకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పట్టణ పరిధిలో జన సంచారం ఉన్న ప్రాంతాలను గుర్తించి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమీషన్ల రోజాకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు: భాను



సమన్వయకమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 8: నగరి నియోజకవర్గంలో కమీషన్ల రోజాకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కూటమి సమన్వయకమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వడమాలపేట మండలంలో పాదిరేడు వద్ద టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో మంత్రి రోజా ఎకరాకు 4 నుంచి 20 లక్షల రూపాయల వరకు కమీషన్ దండుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సహజ సంపదను పూర్తిగా దోచుకుని కోట్లు గడించారని, కొండలు, గుట్టలను పిండి చేసి రూపురేఖలే మార్చేశారన్నారు. వైసీపీ వారు చేసిన అన్యాయాలను, అక్రమాలను గుర్తు పెట్టుకుని తగిన గుణపాఠం చెబుతామన్నారు. టీడీపీ నాయకులపై అన్యాయంగా కేసులు పెట్టిన పోలీసులను సైతం వదిలిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం తథ్యమని, నగరిలో టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు. రోజా ఓటమి భయంతో మూడు రోజుల పాటు చేసే పూజలను ఏడు రోజులపాటు చేస్తున్నారన్నారు. చెంగారెడ్డి మంత్రిగా ఏరియా వైద్యశాలను కట్టిస్తే రంగులువేసి తానే కట్టించానని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, పుత్తూరు పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, దశరధవాసు, షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ బాలాజీ, మహిళా అధికార ప్రతినిధి మీరా, లక్ష్మీప్రసన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అన్నివర్గాల అభ్యున్నతి: ఆదిమూలం



ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 8: చంద్రబాబుతోనే కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలూ అభ్యున్నతి సాధిస్తాయని సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. సోమవారం ఉదయం నారాయణవనం మండల పరిధిలోని పాలమంగళం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గంలో స్థానికుడుగా ఉన్నందున ఇక్కడి సమస్యలపై అవగాహన ఉందని, టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, అన్నదాతలకు సంక్షేమ పథకాలు అందించాలన్నా, మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్నా చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం పాలమంగళం, ఉత్తరపు కండ్రిగ పంచాయతీ, సాయంత్రం నారాయణవనంలోని 9,10,11,12 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, రవి, మాణిక్యం రెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మునిబాబు, దయాసాగర్, సోమశేఖర్, కోదండపాణి, కొల్లాపురి, సుకుమార్, ఆర్‌డి ఏకాంబరం, కేఎస్‌వీ భక్తవత్సలం, పరుశురామయ్య, హరి, శివకుమార్, దొరవేలు, రమేష్, మునిబాబు, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు ముక్కంటి ఆలయంలో ఉగాది వేడుకలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఉగాది పర్వదినం వేడుకలను నిర్వహించనున్నట్లు నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో వెల్లడించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా పంపిణీ చేస్తామని వివరించారు. ఆలయంలో సాయంత్రం 4 గంటల వేళ పంచాంగ శ్రవణం, ఏడు గంటలకు కవి సమ్మేళనం, అనంతరం కవి సత్కారం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించనున్నారు.

కదం తొక్కిన ముదిరాజులు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తిలో ముదిరాజ్ సామాజికవర్గం ప్రజలు సోమవారం మహా సంకల్పం ర్యాలీతో కదం తొక్కారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులను బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏకు మార్చాలని కోరారు. అనంతరం పట్టణ వీధుల్లో భారీ యాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కపిల్, కోశాధికారి గోవిందస్వామి కోటేశ్వరరావు ఆర్.సుబ్రహ్మణ్యం, ఈశ్వర్, అయ్యప్ప, అమరావతి, నాగలక్ష్మి, సునీత, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత ఖాదర్ బాయ్‌కు ఎమ్మెల్యే నివాళి



పిచ్చాటూరు, ఏప్రిల్ 8: పిచ్చాటూరుకు చెందిన మండల సీపీఐ నేత ఖాదర్‌బాయ్(70) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఎమ్మెల్యే ఆదిమూలం ఆయనకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్దురాజు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి తొట్టంబేడు మండలం చిన్నకన్నలి గ్రామానికి చెందిన కిలారి శ్రీనివాసులు నాయుడు రూ. 1 లక్ష నగదు విరాళంగా సమర్పించారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులును కలిసి నగదు అందజేశారు. ఆలయ అధికారులు దాతను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇత్తడి బిందెల వితరణ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెన్నై నగరానికి చెందిన మహేశ్వరి అనే భక్తురాలు 10 ఇత్తడి బిందెలను వితరణ చేశారు. ఆలయ పరిపాలన భవనంలో సోమవారం ఈవో నాగేశ్వరరావుకు వాటిని అందజేశారు. సుమారు రూ. 28 వేల విలువ ఉంటుందని అధికారులు తెలిపారు. దాతకు అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

తొట్టంబేడు, ఏప్రిల్ 8: మండలంలోని గెద్దగుంట వద్ద కోడిపందేలు ఆడుతున్న 11 మందిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.1900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

తొట్టంబేడు, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడులోని తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న సుబ్బు(38)ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ తెలిపారు.

రౌడీయిజాన్ని పెకలించేస్తా : సుధీర్‌రెడ్డి





ఐక్యతను చూపుతున్న కూటమి నేతలు, టీడీపీలో చేరిన చక్రాల మురళి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తిలో రౌడీయిజాన్ని కూకటి వేళ్లతో సహా పెకలించి ప్రశాంతమైన గోపాలన్న పాలన తీసుకొస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలోని 9, 10, 12 వార్డుల్లో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. పట్టణంలోని పలువురు వ్యాపారులు వైసీపీ పాలనలో జరిగిన దౌర్జన్యాలపై ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కంఠా రమేష్, సుప్రజ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి

రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకోవాలన్న ఆశయంతోనే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఏర్పడిందని నేతలు అభిప్రాయ పడ్డారు. శ్రీకాళహస్తిలోని మధు ఆడిటోరియంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ జనసేన, బీజేపీ తనకు రెండు కళ్లుగా భావిస్తానని తెలిపారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థులు గెలుపుకోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే మధును చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు చంద్రప్ప, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కంద్రిగ ఉమ, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

పట్టణంలోని 9వ వార్డు పరిధిలో మాజీ కౌన్సిలర్ సుప్రజ ఆధ్వర్యంలో దక్షిణ కైలాస్ నగర్ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు చక్రాల మురళి, చిన్నరాయుడు, సుబ్రమణ్యం తదితరులు టీడీపీలో చేరారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 4వ వార్డుకు చెందిన 100 మంది యువకులు వైసీపీకి స్వస్తి పలికి సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నాయకులు మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడును విద్యాకేంద్రంగా అభివృద్ధి చేస్తాం..

ఏర్పేడు మండలాన్ని విద్యాకేంద్రంగా అభివృద్ధి చేస్తామని బొజ్జల రిషితారెడ్డి అన్నారు. బండారు పల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, పొన్నారావు, నాగరాజునాయుడు, సామా అంకయ్య, గాలి కృష్ణవేణి, రవినాయుడు, రెడ్డివారి శివశంకర్‌రెడ్డి, గుణ యాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక



ఏర్పేడే మండలంలోని చెల్లూరు ఎంపీటీసీ రాధ ఆధ్వర్యంలో గుండ్లకంద్రిగ గ్రామానికి చెందిన అరుంధతివాడ వాసులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సుధీర్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మునగలపాళెం సర్పంచ్ మంజు భార్గవి, జడ్పీటీసీ తిరుమలయ్య నాయకులు సతీష్‌నాయుడు, మోహన్ రావు, హేమాక్షిరాయ్, కన్నలి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలు కలవకుండా చూడండి





వ్యర్థపు నీరు చేరేందుకు ఏర్పాటు చేసిన నీటి పైపులు, మృతిచెందిన చేపలు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 8: శ్రీసిటీ పరిధిలోని మోండలేజ్ ఫుడ్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థపు నీరు చిలమత్తూరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని చిలమత్తూరు సర్పంచ్ ప్రవీణ కోరారు. మండలంలోని చిలమత్తూరు పంచాయతీలో శ్రీసిటీ పరిధిలో మోండలేజ్ ఫుడ్ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు చిలమత్తూరు చెరువులో కలుస్తున్నాయి. ఆ కలుషిత నీరు తాగి పశువులు, గొర్రెలు, మేకలు అనారోగ్య సమస్యలతో చనిపోతున్నాయి. అలాగే చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.

నకిలీ రైల్వే పోలీస్ అరెస్ట్

నాగలాపురం, ఏప్రిల్ 8: నకిలీ రైల్వే పోలీసును స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారం రోజులు మునుపు ఓ వ్యక్తి ఆర్‌పీఎఫ్ పోలీస్ నంటూ నాగలాపురంలోని పలు ఇంటర్‌నెట్ కేంద్రాల నుంచి డబ్బుల వసూలుకు యత్నించాడు. దీనిపై గత శనివారం రైల్వే పోలీస్ పేరుతో డబ్బులు డిమాండ్ అన్న కథనం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైంది. ఎస్ఐ ఓబయ్య విచారణ చేపట్టారు. నకిలీ రైల్వే పోలీసులా వ్యవహరించిన పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన వినురాజును అరెస్టు చేశారు. కాగా రైల్వే పోలీసుల సాయంతోనే నిందితుడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. ఈ నకిలీ పోలీస్‌ని కేసు నుంచి తప్పించేందుకు మండలానికి చెందిన ఓ అధికార పార్టీ నేత పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

రూ 1.90 లక్షల నగదు స్వాధీనం

శ్రీకాళహస్తి: బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన అయ్యప్ప అనే వ్యాపారి తిరుపతి నుంచి కారులో రూ.1.90 లక్షల నగదు తరలిస్తుండగా శ్రీకాళహస్తి ఒకటో పట్టణ ఎస్ఐ అరుణ సోమవారం ఏపీ సీడ్స్ కూడాలి వద్ద పట్టుకున్నారు.

26 మంది వలంటీర్ల రాజీనామా

రేణిగుంట: గాజులమండ్యం సచివాలయం-1లో విధులు నిర్వహిస్తున్న 26 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను కార్యదర్శి రమేష్‌బాబుకు అందజేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

రేణిగుంట: ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పోలీసులు కృష్ణాపురం, ఎస్‌యూ పురం, మల్లవరం గ్రామాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు.

శ్రీసిటీలో ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో



ఆదర్శ్ రాజేంద్రన్‌ను సన్మానిస్తున్న శ్రీసిటీ ప్రతినిధులు

శ్రీసిటీ, ఏప్రిల్ 8: రాష్ట్ర ఎంఎస్ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) కార్పొరేషన్ సీఈవో ఆదర్శ్ రాజేంద్రన్ సోమవారం శ్రీసిటీని సందర్శిం చారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. దేశంలోని ఇతర పారిశ్రామికవాడలకు ఇది ఒక ఉత్తమ మోడల్‌గా నిలుస్తుందని ఆదర్శ్ రాజేంద్రన్ చెప్పారు. శ్రీసిటీ అధికారులతో చర్చల్లో ఆయన మాట్లాడుతూ శ్రీసిటీ, పరిసర ప్రాంతాల్లోని భారీ పరిశ్రమలకు సేవలందించేలా మరిన్ని చిన్న, మధ్య తరహా అనుబంధ కంపెనీలు నెలకొల్పేలా ఈ ప్రాంతంలో ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మాండెలేజ్, ఎంఎస్‌ఆర్ గార్మెంట్స్, అడెలా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను సందర్శించారు. ఈ పర్యటనలో పరిశ్రమల శాఖ సహాయసంచాలకులు రామమూర్తి కూడా పాల్గొన్నారు.

వేడుకగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమ వారం అమావాస్య ఉత్సవం వేడు కగా జరిగింది. అమావాస్య తిధి విశేషాన్ని పురస్కరించుకొని ఆలయంలోని అలంకార మండ పంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంక రించారు. ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ల కేటాయింపుపై రాహుల్ గాంధీ దృష్టి సారించాలి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించడంపై రాహుల్ గాంధీ దృష్టి సారించి సీనియర్లకు న్యాయం చేయాలని పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తయ్య నాయుడు కోరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తయ్య నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు బీటీ శేఖర్, వెంకట ముని, గోపి పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు, పరమశివుడికి ప్రీతికరమైన సోమవారం అమావాస్య తిధి కలిసి రావడంతో భక్తులు విశేషంగా భావించారు. ఉదయం నుంచే భక్తుల రద్దీతో క్యూ లైన్లు దర్శనమిచ్చాయి. అధిక సంఖ్యలో రాహు కేతు పూజలను జరిపించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 28వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

కొత్తగా 15,006 మంది ఓటర్లు

సత్యవేడు, ఏప్రిల్ 8: సత్యవేడు నియోజకవర్గంలో ఈ సారి 15,006 మంది కొత్తగా ఓట్లు నమోదు చేసుకున్నారని ఏఆర్‌వో, తహసీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. రెవెన్యూ డీటీ రవిచంద్రబాబు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఎంఈవో రవి పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: శ్రీకాళహస్తీశ్వరయానికి అనుబంధంగా వెలసిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి ఉగాదని పురస్కరించుకుని పట్టణానికి చెందిన జై సుబ్రహ్మణ్యం స్వామి ట్రస్టు నిర్వాహకులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: ఈనెల 17వ తేదీన శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలోని నెహ్రూ వీధిలో వెలసిన పట్టాభిరామ మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవ నిర్వహించనున్ననట్లు ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు.

యువశ్రీ మురళికి ఉగాది కవి సత్కారం



బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 8: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న కవి, రచయిత, ఉపాధ్యాయులు యువశ్రీ మురళికి ఉగాది కవి సత్కారం లభించింది. సోమవారం తిరుపతి యూత్ హాస్టల్లో జిల్లా రచయిత సంఘం ఆధ్వరంలో నిర్వహించిన క్రోధి నామ సంవత్సర ఉగాది సమ్మేళనంలో కవిత పఠించినందుకు సంఘం అధ్యక్షులు సాకం నాగరాజు, గౌరవ అధ్యక్షులు గార్లపాటి దామోదర నాయుడు శాలువతో సత్కరించి పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, శతావధాని ఆముదాల మురళి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో రవీంద్రనాథ్ త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్క రించారు. అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్‌ను ఉపాధ్యాయులకు, సిబ్బందికి అందించారు.

గడ్డి దగ్ధం

ఏర్పేడు: మేర్లపాక గ్రామంలో రైతు సురేష్‌కు సంబంధించిన 120 గడ్డిమోపులకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. రూ.1.20 లక్షలు నష్ట పోయినట్లు బాధితుడు వాపోయాడు.

చేనేత సంఘ అద్దె గదుల నిర్వహణపై రచ్చ

- ఇరువర్గాల వాగ్వాదం
- పోలీసుల జోక్యం
- తాత్కాలికంగా సద్దుమణిగిన వివాదం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 8: చేనేత సంఘం అద్దె గదుల నిర్వహణపై రచ్చ జరిగింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వరదయ్యపాళెంలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా శ్రీబాలవినాయక చేనేత సహకార సంఘానికి కొంత స్థలం ఉంది. ఆ స్థలంలో ఐదు దుకాణాల గదులు, ఒక ఇల్లు నిర్మించారు. గదికి రూ.2,500, గృహానికి రూ.వెయ్యి అద్దె నిర్ణయించారు. అన్నింటినీ అద్దెకు ఇచ్చేశారు. గత డిసెంబరు ఆఖరుతో లీజు గడువు ముగిసిపోయింది. అదే సమయంలో సహకార సంఘం కాలపరిమితి సైతం ఏడాది క్రితమే ముగిసింది. అయితే దుకాణదారులు అప్పటి సహకార సంఘం చైర్మన్‌కు అద్దె చెల్లిస్తూ కొనసాగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఏపీ దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్ ఆ గదులను బలవంతంగా మూయించారు. కొత్త కమిటీ ఏర్పడి కొత్తగా వేలం వేసే వరకు దుకాణాలు నడపడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు పన్నెం నిర్మల్ దుకాణదారులకు మద్దతు తెలియజేశారు. సంఘానికి చెందిన భవనంలోని గదులను మూయించడం సరికాదని సమస్య ఉంటే అధికారుల ద్వారా చర్యలు తీసుకోవాలని నిర్మల్ కోరారు. పదవీ కాలం ముగియడంతో ఇన్‌చార్జి ఏడీవో పర్యవేక్షణలో ఉన్న గదులకు పూర్వ పాలకమండలి చైర్మన్ అద్దె ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని మూడు రోజుల్లో చేనేత శాఖ ఏడీ ద్వారా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

ఇంటర్వ్యూ



చిత్తూరు పార్లమెంటు బరిలోకి హఠాత్తుగా ప్రవేశించారు ఆయన. అయితే ఆ నిర్ణయం మాత్రం హఠాత్తుగా తీసుకున్నది కాదు. ఉన్నతోద్యోగిగా సుదీర్ఘకాలపు అనుభవం.. లాభదాయకమైన సంస్థ నిర్వహణలో పొందుతున్న సంతృప్తి.. ఊరిని వేదికగా చేసుకుని చేస్తున్న సేవా కార్యక్రమాలు.. వీటి నుంచి పుట్టిన ఆలోచనే ఆయనను రాజకీయాల్లోకి నడిపింది. ప్రజాసేవకు అధికారం బలమైన ఆలంబన అవుతుందంటూ కుమారుడు ఇచ్చిన సూచన ఆయన్ను చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దించింది. నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ, ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, పరిష్కార లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ప్రయాణం సాగిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పంచుకున్న అంశాలు ఇవి...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చంద్రబాబు విజన్ చూసే రాజకీయాల్లోకి..

టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్

టీడీపీలో చేరేందుకు కేవలం చంద్రబాబే కారణం. దశాబ్దాలుగా ఆయన్ను, ఆయన పాలనను, అందులో ఆయన విజన్‌ను చూస్తున్నా. విజన్ 2020 అని చంద్రబాబు అన్నప్పుడు అందరూ నవ్వారు. దాన్ని ఆయన నిజం చేసి చూపించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాఫ్ట్‌వేర్ రంగంపై ఆధారపడనుందని అప్పట్లోనే గుర్తించి హైటెక్ సిటీని అభివృద్ధి చేశారు. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో చంద్రబాబును మించినవారు లేరు.

చిత్తూరుకు చంద్రబాబే పంపించారు..

బ్యాంకు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు నేనూ టీడీపీ పార్టీలో చేరుతానని నా ప్రొఫైల్ అందించాను. చంద్రబాబు నుంచి ఎలాంటి హామీ పొందకుండానే నా సొంత పార్లమెంటు నియోజకవర్గం బాపట్లలో టీడీపీ కోసం గట్టిగా పనిచేశాను. నాకు లభిస్తున్న ఆదరణ చూసి పోటీ చేద్దామనే నమ్మకం కలిగింది. ఆ తర్వాత చంద్రబాబును కలిసి బాపట్ల ఎంపీ టికెట్ అడిగాను. ఆయన నన్ను చిత్తూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేయమని పంపించారు.

రాజకీయాల్లోకి వచ్చినవారి మీద ప్రజలకు ఒక బలమైన అభిప్రాయం ఉంటుంది. అదేంటంటే.. వీళ్లు డబ్బులు సంపాదించుకోవడానికే వచ్చారని. నాకు ఆ అవసరం లేదు. ఉన్నత ఉద్యోగిగా హోదా అనుభవించాను. డబ్బులు చూసేశాను. నా మీద ఆధారపడినవారు లేరు. కొడుకు స్వతంత్రంగా ఎదిగాడు. ప్రజలకు మంచి చేద్దామనే ఒకే ఒక్క ఆలోచన నాది. ఆచరణకు అధికారం బలాన్నిస్తుందనే నమ్మకంతోనే ఎంపీగా పోటీ చేస్తున్నాను.

అనేక ప్రాంతాల్లో అధికారిగా..

ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటులో హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, పూణె, ఔరంగబాద్, లాతూర్, ఉస్మానాబాద్, నాందేడ్, బెంగుళూరు, గుల్బర్గా వంటి ప్రాంతాల్లో పనిచేశారు. మూడేళ్ల సర్వీసు ఉండగానే గుల్బర్గాలో ముందస్తు పదవీ విరమణ తీసుకున్నాను.

'పే బ్యాక్ టూ సొసైటీ'

మూడు నెలల కిందట వరకూ కూడా నేను రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. 'పే బ్యాక్ టూ సొసైటీ' అనే మాట సర్వీసులో చేరినప్పటి నుంచీ నా మనసులో నాటుకుపోయింది. మా గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, లైబ్రరీ ఏర్పాటు, అనారోగ్యంతో బాధపడేవారికి, అవసరమున్నవారికి ఆర్థిక సాయం చేయడం వంటివి చేసేవాడిని. చదువుకున్న వారికి శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు వచ్చేలా చేసేవాడిని. అలా ఉద్యోగాలు పొందినవారిలో సుమారు 20 మంది ఉన్నత హోదాల్లో ఉన్నారు. 2009లో ఓ అబ్బాయికి రూ.7 వేల జీతానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించాను. ఇప్పుడతను రూ.3.50 లక్షల జీతాన్ని డ్రా చేస్తున్నాడు. నేను ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా ఉన్నప్పుడు పెద్ద పెద్ద పరిశ్రమలతో సంబంధాలుండేవి. వాటి ద్వారా నేను ఉద్యోగాలకు సిఫార్సు చేసేవాడ్ని.

సేవ కోసం రాజీనామా

చిన్న స్థాయిలో చేసే సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేందుకే ఉద్యోగానికి రాజీనామా చేశాను. అప్పటికే నా కొడుకు రాధే నిర్మాణ రంగంలో మంచిగా స్థిరపడి ఉన్నాడు. అతన్ని సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవ్వమని చెప్పాను. గజియాబాద్ ఐఎంటీ బిజినెస్ కాలేజీలో చదివిన ఆయన బయటికి వచ్చిన వెంటనే వ్యాపారం చేస్తానన్నాడు. నా నుంచి ఆర్థిక అండ కూడా లేకుండానే స్వతంత్రంగా నిర్మాణ రంగంలో అడుగు పెట్టి ఇప్పుడు పెద్ద స్థాయిలో స్థిరపడ్డారు. ఉద్యోగం మానేసి తన నిర్మాణ కంపెనీలోకి రమ్మని రాధే నన్ను ఆహ్వానించారు. రాజీనామా చేశాను. ఇప్పుడు మా సంస్థ మంచి పురోగతి చెందింది.

ఐదేళ్లలో రాజధాని ఎలా సాధ్యం

సాధారణంగా ఓ కొత్త రాజధాని నిర్మాణానికి 25 నుంచి 30 ఏళ్లు పడుతుంది. డిజైన్ ఆరేడు ఏళ్లు, నిర్మాణానికి 20-25 ఏళ్లు అవసరం. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్, ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రా నగరాల నిర్మాణం ఓ ప్లాన్ ప్రకారం జరిగింది. అలాంటిది మన రాష్ట్రనూ తన రాజధాని అమరావతిని నాలుగైదు ఏళ్లలో నిర్మించలేదని ఆయన్ను దించేశాం. మనమంతా విజ్ఞతతో ఆలోచించలేదు. ఇదే అదునుగా కొత్త సీఎం మూడు రాజధానులు అన్నారు. చివరికి రాష్ట్ర ప్రజలంతా రాజధాని లేనివాళ్లం అయిపోయాం.

ఎంపీ అభ్యర్థికి లోకల్, నాన్‌లోకల్ ఉండదు

చిత్తూరు నాన్ లోకల్ అవుతుందేమో నని చంద్రబాబును అడిగాను. ఎంపీ అభ్యర్థికి నాన్‌లోకల్ ఏంటన్నారు ఆయన. అప్పటికే వైసీపీ బాపట్ల ఎంపీగా గెలిచిన నందిగామ సురేష్ నాన్‌లోకల్. బాపట్లలో ఎప్పుడూ ఏ పార్టీ నుంచి లోకల్ అభ్యర్థి బరిలో లేడు. నరసరావుపేటలో వైసీపీ నుంచి ఎంపీగా బరిలో ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ కూడా నాన్ లోకల్. ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడ నాన్‌లోకల్.

జిల్లా ప్రజలు నన్ను సొంతం చేసుకున్నారు

చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, అమర్నాథ్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, మురళీమోహన్, థామస్.. ఇలా అందరూ తమ సొంత మనిషిలా నన్ను రిసీవ్ చేసుకున్నారు. చిత్తూరు జగన్మోహన్ అయితే తనతో పాటు నన్ను నేరుగా ప్రచారంలోకి తీసుకెళ్లిపోయారు. కుప్పంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా అన్ని సమావేశాలు, సభల్లో ఆయన నన్ను పరిచయం చేశారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించి ప్రచారాల్లో పాల్గొన్నాను. అందరు ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం చేసుకుని ఎన్నికలకు ఏం అవసరమో ఆ దిశగా కృషి చేస్తున్నాను. బీజేపీ, జనసేన నాయకులు నన్ను మరింతగా సొంతం చేసుకున్నారు.

సమస్యలేమిటో గుర్తించా

చిత్తూరు పార్లమెంటు పరిధిలో ప్రజల సమస్యల్ని ఇప్పటికే గుర్తించాం. చేనేతల సమస్యలు, పట్టు రైతుల ఇబ్బందులు, గ్రానైట్ పరిశ్రమల కష్టాలు, పండ్లు, కూరగాయల రైతుల అవసరాలన్నీ గుర్తించాం. గెలిచి వాటి పరిష్కారానికి కృషి చేయాలి.

పెన్షన్లపై జగన్ అబద్ధాలు

ఖజానాలో డబ్బుల్లేక పెన్షన్లను ఇవ్వలేదు. పైగా టీడీపీ మీద బురద జల్లుతున్నారు. జగన్ నియంతృత పరిపాలన చేస్తున్నాడు. రాష్ట్రంలో ఏం జరిగినా ఎవరెలా పోయినా అధికారం మాత్రం నాకే కావాలనే మనస్తత్వం కలిగినవారు. ఎంత మందినైనా తొక్కేసి అయినా నేను గెలవాలనుకునేవారు అధికారంలోకి వస్తే ప్రమాదం.

నాకెందుకు ఓటేయాలంటే..

ప్రస్తుత ఎంపీ రెడ్డప్ప ఐదేళ్లలో ఏం చేశారనేది జనాలకు తెలుసు. కొత్తవాడిని.. నా గురించి ఏమీ తెలియదు. నన్ను నమ్మి మాత్రమే ప్రజలు ఓటేయాల్సి ఉంది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. నిత్యం అందుబాటులో ఉంటాను. పార్లమెంటులో గళాన్ని వినిపిస్తా. నేను పనిచేయకుంటే నిలదీయండి. కమ్‌డౌన్ అని నన్ను అడ్డుకోండి.

రాజకీయాలు.. మా అబ్బాయి ఆలోచనే

కంపెనీలో చేరాక సీఎస్ఆర్‌లో భాగంగా సామాజిక కార్యక్రమాలు చేసేవాడ్ని. మనం చేసే సామాజిక కార్యక్రమాలకు ప్రభుత్వం తోడైతే మరిన్ని అద్భుతాలు చేయొచ్చని మా అబ్బాయి అనేవాడు. ఆ ఆలోచనే నన్ను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది.



డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను

చదువుకుని వచ్చాను, ఉన్నత ఉద్యోగం చేశాను, పెద్ద స్థాయిలో వ్యాపార రంగంలో రాణిస్తున్నాను. నాకున్న లక్ష్యం వేరే వాళ్లకు ఉండాలనేం లేదు. ఇతరులతో నన్ను పోల్చుకోలేను. గెలిచాక నేను మాత్రం డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను. పార్లమెంటులో హాజరు నమోదుకే పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి పోరాడుతాను. అన్ని రంగాల పట్ల నాకు అవగాహన ఉంది.

జగన్ గెలిస్తే డ్రగ్స్‌లో పంజాబ్‌ను మించిపోతాం

సీఎం జగన్‌కు పరిపాలన అనేది తెలియదు. అడ్మినిస్ట్రేషన్ జీరో అని చెప్పవచ్చు. ఈ ప్రభావం యువత మీద పడింది. యువతకు ఉద్యోగాలు లేవు. చదువుకున్నవాడు కూలి పనులకు పోలేడు. చెడు వ్యసనలకు అలవాటు పడుతాడు. అందుకే రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, నాసిరకం మద్యం విచ్చలవిడిగా ఉన్నాయి. పంజాబ్ యువత కూడా ఇలానే డ్రగ్స్‌కు అలవాటు పడింది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని కాపాడుకోలేక పోతున్నారు. ఆ పరిస్థితి మనకూ ప్రారంభమైంది. మళ్లీ జగన్ గెలిస్తే మాత్రం మన రాష్ట్రం పంజాబ్‌ను మించి పోతుంది. ఇక ఆర్థిక పరిస్థితి తెలిసిందే. రాష్ట్రంలో ఆరేడు లక్షల కోట్ల రూపాయల అప్పు ఉంది. ఒకప్పుడు తలసరి ఆదాయం గురించి చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు తలసరి అప్పు గురించి చెప్పుకునే స్థితికి తెచ్చారు. జగన్‌ను కంటిన్యూ చేస్తే జీవితాలను కోల్పోతారు.

టీటీడీ జేఈవోగా గౌతమి



తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి నియమితులయ్యారు. ఈమేరకు ఈమెను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో గౌతమిని నియమించారు. గౌతమి.. 2007-09 వరకు చిత్తూరు జిల్లాలో ప్రొబేషనరీ అధికారిగా, 2012 వరకు అనంతపురం ఆర్డీవోగా, 2015 వరకు నెల్లూరు డ్వామా పీడీగా, 2019 వరకు టీటీడీ డిప్యూటీ ఈవోగా, 2022 వరకు కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 2023 వరకు తిరుపతి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవోగా, ఆ తర్వాత అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. అర్బన్ పరిధిలోని ఉద్యోగుల సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఇద్దరు సిబ్బంది ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటారు. ఫారం 12, ఆర్డర్ కాపీ, ఎపిక్ కార్డు, ఆధార్ జిరాక్స్ సమర్పించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగులు వ్యక్తిగతంగా హాజరవ్వాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఎన్నికల విధుల్లో బాధ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొని బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో ఎన్నికల అధికారులకు సోమవారం జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుందని, అప్పటి వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ఆత్మీయ సభలో పాల్గొన్న టౌన్ బ్యాంకు మేనేజర్‌కు షోకాజ్

తిరుపతి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తిరుపతి కోఆపరేటివ్ (టౌన్ బ్యాంకు) బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ రెడ్డి (పాండు)కి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం షోకాజ్ నోటీసు పంపారు. టౌన్ బ్యాంకు మాజీ ఉద్యోగులకు మెడికల్ బిల్స్ ఇస్తామని శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌కు పిలిపించి వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'వైసీపీ ఆత్మీయ సభలో టౌన్ బ్యాంకు మేనేజర్' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఎన్నికల అధికారి స్పందిస్తూ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కాగా టౌన్ బ్యాంకు కోఆపరేటివ్ సొసైటీ పరిధిలో ఉండడం వలన రాజకీయ పార్టీ నేతలతో కలవకూడదన్న నిబంధన ఉన్నట్లు తనకు తెలియదని పాండు వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన వివరణపై కలెక్టర్ ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

ట్రాఫిక్ పోలీసులకు టోపీల పంపిణీ



తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 8 : ట్రాఫిక్ పోలీసులకు రాస్ ఆధ్వర్యంలో సోమవారం ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ టోపీలు పంపిణీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ట్రాఫిక్ పోలీసుల బాధలు పట్టించుకోవడం హర్షణీయమన్నారు. పోలీసులు సేవ, అంకిత భావంతో పనిచేయాలని కోరారు. రాస్ ప్రతినిధులు వెంకటరత్నం, నాగరాజు పాల్గొన్నారు.







ఉగాదికి తిరుమల ముస్తాబు

నేడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఆస్థానం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఆలయంలోని బంగారు వాకిలిలో పండితులు ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్, పుష్పాలంకరణలో ఆలయం ప్రత్యేక అందాలతో దర్శనమిస్తోంది. తిరుమల క్షేత్రాన్ని దాదాపు 10 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. ఆలయంలోని ధ్వజస్తంభం, బలిపీఠాన్ని 60 వేల కట్‌ఫ్లవర్లతో అలంకరించారు. ప్రత్యేకించి ఆలయం ముందు రాముడు, మత్స్యావతారం, చిన్నికృష్ణుడితోపాటు పలు అవతారాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. అలాగే యుగాల సెట్టింగులు వేశారు. అద్దాల మండపం వద్ద అయోధ్యరాముడి సెట్టింగ్, నవధాన్యాలతో మత్స్యావతారాన్ని ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేశారు. ఆలయంతోపాటు మహద్వారం గేటుకు మామిడి, చెరకు, అరటి ఆకులతో అలంకరణలు చేశారు.

తిరుమలలో పలుచగానే భక్తులు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. సాధారణంగా ఉగాది పర్వదినానికి రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించలేదు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ పలుచగానే కనిపించింది. ఉదయం 6 గంటల సమయానికి దర్శనానికి డైరెక్ట్ లైన్ ఉండగా, సాయంత్రం 7 గంటల సమయానికి ఎనిమిది కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి 4 గంటల దర్శన సమయం పట్టింది. అలిపిరి టోల్‌గేట్‌తోపాటు ఘాట్‌రోడ్లు ఖాళీగానే కనిపించాయి.

బైండోవర్ పాలిటిక్స్ ఏమిటి సార్లూ?

వైసీపీ నేతలు మాత్రం ఇందుకు అతీతులా.. ● ఎన్నికల నిర్వహణలో నిష్పక్ష అధికారులకు చోటు కల్పించాలి
● ఎన్డీఏ ఉమ్మడి సమన్వయ సమావేశం తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం విపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం, అవి సరిపోక ఇప్పుడు బైండోవర్ కావాలని నోటీసులు పంపడాన్ని తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్డీఏ నేతలు ఖండించారు. సోమవారం ఓ ప్రైవేట్ హోటల్లో ఎన్డీఏ కూటమి ఉమ్మడి సమన్వయ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమావేశం తీర్మానం చేసింది. ముందుగా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ విపక్ష నాయకులకు బైండోవర్ నోటీసులిచ్చి భయపెట్టాలని చూస్తున్నారని, అదేవిధంగా ఎంతమంది వైసీపీ నాయకులకు నోటీసులు పంపారో పోలీసు అధికారులు మీడియాకు విడుదల చేయాలని డిమాండు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, ఇతర ప్రాంతాల్లో నివసించే ఓటర్లు కలవడం వంటి వివిధ అంశాలపై మూడు పార్టీల నాయకులతో కలసి ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ నేతల అరాచకపాలనకు స్వస్తిపలికేలా కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటేనే రాష్ట్ర భవిష్యత్తుకు మార్గం సుగమమం అవుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థులను గెలిపించడానికి మూడు ముఖ్య పార్టీలతో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసుకుని తద్వారా ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలని ఈ సమావేశం తీర్మానించింది. అదేవిధంగా బైండోవర్ నోటీసులపై కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు సజావుగా జరగడానికి నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులకు చోటు కల్పించి, అధికార పార్టీకి అడుగులకు మడుగులొత్తుతున్న అవినీతి అధికారులను తొలగించాలని సమావేశం డిమాండు చేసింది. టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, విజయలక్ష్మి, ఆనంద్ గౌడ్, బీజేపీ నేతలు శాంతారెడ్డి, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, పొనగంటి భాస్కర్, మునిసుబ్రమణ్యం, జనసేన నాయకులు రాజారెడ్డి, కీర్తన పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సమైక్యత నేర్పిన అన్నమయ్య



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 8: తన కాలంలోని రాజకీయ కారణాలతో ప్రజలలో అడుగంటిన భక్తిభావాన్ని చైతన్య పరచి, ఆధ్యాత్మిక సమైక్యత సాధించడానికి వేంకటేశ్వర స్వామి సంకీర్తనలను కేంద్రంగా చేసుకున్న వారు అన్నమయ్య అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమన్ అన్నారు. అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాహిత్య సభ నిర్వహించారు. అన్నమయ్య - ప్రబోధం అనే అంశంపై సర్వోత్తమరావు, శ్రీపొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వాచార్యులు గార్లపాటి దామోదరనాయుడు మాట్లాడారు.

టీడీపీ నేతలపై బైండోవర్ కేసులు

సొంత పూచీకత్తుపై విడుదల



తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 8 : పాత కేసులు తిరగతోడి టీడీపీ నాయకులపై పోలీసులు బైండ్ ఓవర్ కేసులు నమోదు చేస్తున్నారు. సోమవారం ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు పాత కేసులున్న పలువురు టీడీపీ నేతలను స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి, తహసీల్దార్ ఎదుట హాజరుపరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఇందులో పార్టీ నగర అధ్యక్షులు ఒట్టికుంట శంకర్, బాలయ్య, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద గౌడు, క్రిస్టియన్ సెల్ నగర అధ్యక్షుడు రవీంద్రబాబు డానియల్ ఉన్నారు. ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒట్టికుంట శంకర్, ఆనందగౌడు మాట్లాడుతూ తిరుపతిలో ఐదేళ్లుగా ప్రజాస్వామ్యం మంటకలసిందన్నారు. దొంగోట్లు రాజ్యమేలుతున్నాయని, పోలీసులు వైసీపీకి తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 8 : ఆర్టీసీ నిబంధనలు తప్పక పాటించాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎం బాలాజీ, బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు దుకాణదారులను ఆదేశించారు. సోమవారం సీబీఎస్‌లోని ఏటీఎం కార్యాలయంలో దుకాణాలతో వారు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఫిర్యాదులు అధికమవుతున్నాయని, కేటాయించిన పరిధిలోనే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, ప్రతి దుకాణం ముందు ధరల పట్టిక ప్రదర్శించాలని, శుభ్రత పాటించాలని అన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, ఇంజనీరింగ్ అధికారి లక్ష్మీనారాయణ, జయచంద్ర, స్వామి పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మృతికి సంతాపం



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 4 : స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతూ అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు పాల్పడిన కే.మోక్ష మృతికి విద్యార్థులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం స్విమ్స్‌లో సంతాప సభ నిర్వహించారు. వైద్యాధికారులు, విద్యార్థులు మోక్ష చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. మోక్ష మృతి బాధాకరమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషాకళావత్, వైద్య విభాగాధిపతులు నాగరాజు, ఉమామహేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 8: తిరుచానూరు జడ్పీహెచ్ఎస్‌లో ఈనెల ఒకటి నుంచి ఎనిమిది రోజులపాటు సాగిన పదో తరగతి మూల్యాంకనం సోమవారంతో ముగిసింది. డీఈవో డాక్టర్ వి.శేఖర్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి వంశీరాజులను ఆపస్ నాయకులు సన్మానించారు.

శంకరంబాడీకి ఘన నివాళి



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 8: మా తెలుగు తల్లికి గీత రచయిత, రాష్ట్ర కవి శంకరంబాడి సుందరాచారి వర్ధంతిని సోమవారం నిర్వహించారు. లక్ష్మీపురం కూడలిలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో గుండాల గోపినాథ్‌రెడ్డి, కెఎస్.రాజా, టి.సుబ్రహ్మణ్యం రెడ్డి, పి.జేజిరెడ్డి, శాంబోలు హరనాథ్ తదితరులు దివంగత కవికి నివాళి అర్పించారు. పలువురు సాహితీప్రియులు పాల్గొన్నారు.

కవితకు బెయిలిస్తే మొదటికే మోసం

- సాక్ష్యాలు తారుమారు చేసి, సాక్షులపై ఒత్తిడి తెచ్చే ముప్పు
- కుమారుడి పరీక్షలనేది బెయిల్‌కి పెద్ద కారణం కానే కాదు
- బెయిల్ నిరాకరిస్తూ ఈడీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో ఈడీ ప్రత్యేక కోర్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ నిరాకరించింది. దీంతో తిహాడ్ జైలు నుంచి కవిత ఇప్పట్లో బయటికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కవితకు బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, సాక్ష్యాధారాలను తారుమారు చేసి తప్పించుకునే ముప్పు ఉందని కోర్టు అభిప్రాయపడింది. కుమారుడి పరీక్షల కోసం కవితకు బెయిల్ ఇవ్వడం తప్పనిసరి కానేకాదని న్యాయమూర్తి కావేరి భవేజా వ్యాఖ్యానించారు. దర్యాప్తులో పాల్గొనకముందు, నోటీసులు అందుకున్న తర్వాత.. కవిత తన ఫోన్లలోని సమాచారాన్ని విధ్వంసం చేసినట్టు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని, ఆమె సాక్ష్యులను ప్రభావితం చేశారన్న విషయం కూడా స్పష్టమైందని న్యాయమూర్తి పేర్కొన్నారు. కవిత తరపున బినామీగా వ్యవహరించిన అరుణ్ పిళ్లై.. కవితపై దర్యాప్తు మొదలైన తర్వాతే తన స్టేట్ మెంట్‌ను మార్చినట్టు ఈడీ వెల్లడించిన విషయాన్ని న్యాయమూర్తి గుర్తుచేశారు. కాబట్టి, ఈ సమయంలో కవితకు బెయిల్ ఇస్తే ఆమె సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. కవిత మహిళ అయినప్పటికీ ఆమెకు బెయిల్ ఇవ్వకపోవడానికి ఇవే ప్రధాన కారణాలని న్యాయమూర్తి కావేరి భవేజా వివరించారు. కవిత కుమారుడికి సగం పరీక్షలు ఇప్పటికే ముగిశాయని.. అతని వద్ద సోదరుడు, తండ్రి, పిన్ని తదితరులు ఉన్నారని న్యాయమూర్తి గుర్తుచేశారు. అసలు కవిత కుమారుడు ఏం చదువుతున్నాడు? ఎన్నిరోజులు బెయిల్ కావాలి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదని.. అతడి వద్ద ఉన్న సన్నిహిత బంధువులు అతనికి ఎందుకు మానసిక మద్దతు అందించలేరో వివరించలేదని పేర్కొన్నారు. తల్లి పక్కన లేకపోతే.. పిల్లవాడు పరీక్షలకు సంబంధించి భావోద్వేగానికి గురవుతాడన్న కారణం బలమైనది కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. కవిత 19 ఏళ్ల పెద్ద కుమారుడు స్పెయిన్‌లో తల్లిదండ్రులు తన పక్కన లేకుండానే చదువుకోగలుగుతున్నప్పుడు.. బంధువులు పక్కన ఉండగా చిన్న కుమారుడు పరీక్షలు ఎందుకు రాయలేడని ప్రశ్నించారు. న్యాయ పోరాటంలో ఉన్నందు వల్ల తండ్రి పక్కన లేడనే వాదన కూడా సరైంది కాదని, పిల్లవాడి పరీక్షలు తండ్రికి ప్రాధాన్యం కాదని దీన్ని బట్టి తెలుస్తోందని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ యుగంలో తండ్రి ఇతర బంధువులు, సోదరుడు డిజిటల్ ఉపకరణాల ద్వారా కూడా కవిత కుమారుడితో సంబంధాలు ఏర్పరుచుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. చదువుకున్న, సంపన్నులైన మహిళలు ఈరోజుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అక్రమ కార్యకలాపాలకు కూడా పాల్పడుతున్నారని, అందువల్ల కోర్టు అలాంటి వారికి బెయిల్ ఇచ్చేముందు న్యాయ సమ్మతంగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. కవిత విద్యాభ్యాసం, చేసిన పదవులను బట్టి చూస్తే ఆమెపై కేసును బనాయించి బలిపశువుగా మార్చారని నమ్మడానికి వీలులేదని కోర్టు అభిప్రాయపడింది. కవిత కేవలం మహిళ అన్న పేరుతో ఆమె పట్ల దాక్షిణ్యం ప్రదర్శించలేమని స్పష్టం చేసింది. అయితే.. రెగ్యులర్ బెయిల్ పై ఈ నెల 16న విచారించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది.

కాలువల్లో నీటి సరఫరాపై డ్రోన్లతో నిఘా: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు ప్రకాశం బ్యారేజీ, నాగార్జున సాగర్ నుంచి విడుదల చేసిన నీరు సక్రమంగా శివారు ప్రాంతాలకు చేరేలా కాలువల వెంబటి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం అమరావతి సచివాలయం నుంచి తాగునీటి సమస్యపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు, సాగర్ కుడి కాలువ నుంచి పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు నీటిని విడుదల చేశారు. 'ఈ నీరు సక్రమంగా జరిగేలా నాలుగు రోజుల పాటు కాలువలపై డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షణ చేయాలి. కాలువ వెంబడి రెవిన్యూ, ఇరిగేషన్ సిబ్బందితో టీమ్‌లు ఏర్పాటు చేసి, నీరు చేపలు, రొయ్యల చెరువులకు అక్రమంగా మళ్లించకుండా గట్టి నిఘా పెట్టాలి' అని ఆదేశించారు.

వైసీపీ పెట్టే కేసులపై జాగ్రత్త

- బీజేపీ శ్రేణులతో సిద్ధార్థ్ నాథ్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేస్తోన్న ఎన్డీఏ అభ్యర్థులపై రాష్ట్రంలోని అధికార వైసీపీ పెడుతోన్న కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బీజేపీ సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ పార్టీ శ్రేణులకు సూచించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో సమావేశమై ఎన్నికల సమయంలో వారు చేయాల్సిన బాధ్యతలు వివరించారు. పది అసెంబ్లీ, ఆరు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తోన్న బీజేపీ అభ్యర్థులతోపాటు కూటమి తరఫున పోటీ చేసే ప్రతి అభ్యర్థి విజయానికి సమన్వయంతో కృషి చేయాలన్నారు. అధికార వైసీపీ చేసే తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు టీవీ డిబేట్లు, ప్రెస్ మీట్లతో తిప్పికొట్టాలని, అనవసరమైన వివాదాలకు తావు లేకుండా జాగ్రత్తగా ప్రజలకు వివరించాలన్నారు. చేసే ప్రతి పని, మాట్లాడే ప్రతి మాటా కూటమి అభ్యర్థులకు బలంతోపాటు ప్రత్యర్థిని బలహీన పరిచేలా ఉండాలని సూచించారు.

బరిలో నేరచరితులే అధికం: ఏడీఆర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తొలివిడత పోలింగ్ దగ్గరపడుతున్న వేళ ఎన్నికల హక్కుల సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) ఆసక్తికర విషయాలను వెల్లడించింది. తొలిదశలో ఎన్నికలు జరగబోయే 102 స్థానాల్లో... దాదాపు 42 స్థానాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల్లో ముగ్గురు కంటే ఎక్కువ మంది నేరచరితులేనని తేల్చింది. 102 స్థానాల్లో మొత్తం 1,625 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా వారిలో 1,618 మంది అఫిడవిట్లను పరిశీలించిన ఏడీఆర్ ఈ విషయాన్ని వెల్లడించింది. అందులో 16 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, మరో 10 శాతం మంది తీవ్రనేరాల్లో నిందితులుగా ఉన్నారని స్పష్టం చేసింది. అలాగే ఏడుగురిపై హత్య కేసులు, 19 మందిపై హత్యాయత్నం కేసులు, 18 మందిపై మహిళలను వేధించిన కేసులుండగా అందులో ఒకరిపై రేప్ కేసు ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపింది.

హామీ మీది.. పూలు మావి..!

- మాటతప్పిన జగన్‌కు అగ్రిగోల్డ్ బాధితుల వినూత్న నిరసన

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): "మరణించిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు రూ.10లక్షలు పూవుల్లో పెట్టి ఇంటికి పంపుతాం" అని సీఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పి ఐదేళ్లయింది. కానీ, ఇంతవరకూ ఆ హామీని నెరవేర్చలేదు. దీంతో అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయానికి భారీ పూల పార్శిల్ పంపి వినూత్నంగా నిరసన తెలిపారు. "అందుకోండి ఈ పూలు.. నిలబెట్టుకోండి మీ హామీ.." అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంటూరులో సంఘం నేతలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 8: విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలు రంగాల్లో సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మబ్బు సూర్యనారాయణరెడ్డి (బ్లిస్ హోటల్), కాసల నాగభూషణం (వైష్ణవ కాలేజీ, చెన్నై), వెంకటరామిరెడ్డి, (స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్), వైఎస్ బాబు (ఫైన్ ఆర్ట్స్ అకాడమీ), గీతావాణి (పద్మావతి వర్సిటీ డీఆర్), వెంకటనాథ్ (ఛార్టెర్డ్ అకౌంటెంట్), పీవీ రవికుమార్ (సీనియర్ జర్నలిస్టు), సుబ్రమణ్యంరెడ్డి (సామాజిక కార్యకర్త) పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. వీరికి పద్మావతి వర్సిటీ ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఉష, ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్ విజయలక్ష్మి, ధూర్జటి రసజ్ఞ సమాఖ్య కార్యదర్శి వెంకటయ్య, ద్రవిడ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందజేశారు. విద్యా పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు వేడియం భాస్కర్, అధ్యక్షుడు కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ మన్యం నరసింహులు, టి.నరసింహులు పాల్గొన్నారు.

బాలల నేస్తం ఈ పత్రిక ఆవిష్కరణ

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 8: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకతకు అక్షరరూపం ఇస్తున్న బాలలనేస్తం ఈ-మాసపత్రిక ఉగాది సంచికను తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ సోమవారం ఆవిష్కరించారు.డీఈవో మాట్లాడుతూ పిల్లలకు స్ఫూర్తివంతమైన రచనలు, కథలతోపాటు ప్రతిమాసం పిల్లలతో కథలు రాయించే విధానం గొప్పగా ఉందన్నారు.రెండు రాష్ట్రాల విద్యార్థులకు ఇది ఉపకరిస్తుందన్నారు.

మోదీ ప్రసంగాల్లో 'ఆర్ఎస్ఎస్ కంపు'

- ఎవరెవరి పక్షమో అందరికీ తెలుసు
- బీజేపీ గ్రాఫ్ దిగజారుతోంది
- అందుకే మా మేనిఫెస్టోపై నిందలు
- కాంగ్రెస్ న్యాయపత్రలో ముస్లింలీగ్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన ఖర్గే
- ప్రధానిపై ఈసీకి ఫిర్యాదు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో 'న్యాయపత్ర'లో ముస్లిం లీగ్ ముద్ర ఉందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతూనే ఉంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానిపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. మోదీ ప్రసంగాలు ఆర్ఎస్ఎస్ కంపు కొడుతున్నాయని దుయ్యబట్టారు. మరోవైపు ప్రధాని చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టిన ఖర్గే ప్రధాని సహా బీజేపీ సైద్ధాంతిక వాది, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీపై నిప్పులు చెరిగారు. స్వాతంత్ర్యోద్యమకాలంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు ముఖర్జీ మద్దతు పలికారని విమర్శలు గుప్పించారు. "మోదీ-అమిత్‌షాలు తమ రాజకీయ సైద్ధాంతికులుగా పేర్కొంటున్న వారు స్వాతంత్ర్యోద్యమకాలంలో భారతీయులకు వ్యతిరేకంగా బ్రిటీషర్లకు, ముస్లింలీగ్‌కు మద్దతు పలికారు. ఆఖరుకు ఈ రోజు కూడా కాంగ్రెస్ న్యాయపత్రకు వ్యతిరేకంగా ముస్లింలీగ్‌ను ప్రయోగిస్తున్నారు. కానీ, మా న్యాయపత్ర.. దేశంలోని సాధారణ పౌరుల అవసరాలు, ఆకాంక్షలు, వారి డిమాండ్లకు అద్దం పడుతోంది" అని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ ప్రసంగాలు ఆర్ఎస్ఎస్ కంపు కొడుతున్నాయి. బీజేపీ ఎన్నికల గ్రాఫ్ రోజు రోజు పడిపోతోంది. అందుకే ఆర్ఎస్ఎస్ తమ ప్రియమిత్రుడు ముస్లింలీగ్‌ను గుర్తు చేసుకుంటోంది" అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ప్రధాని మోదీపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నట్టు చెప్పారు. మరోనేత పవన్ ఖేరా మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోకు ముస్లింలీగ్‌ను ఎందుకు ఆపాదిస్తున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్, ఎన్సీ సీట్ల ఒప్పందం ఖరారు

జమ్ము కశ్మీర్‌లోని ఐదు, లడక్‌లోని ఒక లోక్‌సభ స్థానానికి సంబంధించి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరింది. చెరో మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉధంపూర్, జమ్ము, లడక్ సీట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు, అనంత్‌నాగ్, బారాముల్లా, శ్రీనగర్‌ల నుంచి తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని వెల్లడించారు. కాగా, అనంత్‌నాగ్ నుంచి పీడీపీ అధినాయకురాలు మెహబూబా ముఫ్తీ స్వయంగా పోటీ పడుతున్నారు. దీంతో ఇక్కడ ఎన్సీ, పీడీపీ, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ అధినేత గులాం నబీ ఆజాద్ మధ్య త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉంది. అయితే, బరిలోఉండాలా? వద్దా? అన్నదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆజాద్ చెప్పారు.

వచ్చేది మేమే!: రాహుల్

శివనీ, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ సారి విప్లవాత్మక నిర్ణయాలు చేర్చామన్నారు. దేశంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలతోపాటు పేద మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.లక్ష చొప్పన జమ చేస్తామని తెలిపారు. సోమవారం మధ్యప్రదేశ్ శివనీ జిల్లా మాండ్లా లోక్‌సభ స్థానం పరిధిలోని ధనోరాలో జరిగిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. 'ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పుడిస్తున్న వేతనాలను రెట్టింపు చేస్తాం. దేశంలోని ప్రతి నిరుద్యోగికీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ ఇచ్చేలా కొత్త చట్టం తెస్తాం. కాంట్రాక్టు ఉద్యోగాల విధానానికి స్వస్తి చెబుతాం. పంటలకు కనీస మద్దతు కోసం చట్టం రూపొందిస్తాం.' అని రాహుల్ పేర్కొన్నారు

'డిజైన్ టెక్' సొమ్ము జప్తు ఉత్తర్వులు సబబే!

- ఈడీ, సీఐడీ జప్తు ఉత్తర్వులు మాత్రం విభిన్నం
- ఈడీ ఉత్తర్వులపై అడ్జుడికేటింగ్ వద్దే తేల్చుకోండి
- స్కిల్ డెవలప్‌మెంట్ పార్టనర్‌కు హైకోర్టు ఆదేశం
- టెక్ సంస్థ వ్యాజ్యాలు కొట్టేసిన న్యాయమూర్తి

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డిజైన్ టెక్ సంస్థకు చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జారీ చేసిన ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ ఉత్తర్వులను(పీఏవో) హైకోర్టు సమర్థించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ టెక్ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యాలను కొట్టివేసింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్లను జప్తు చేస్తూ ఈడీ ఇచ్చిన పీఏవో సరైందేనని పేర్కొంది. అయితే, సీఆర్పీసీ-102ని అనుసరించి సీఐడీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులు, మనీ లాండరింగ్ చట్టం కింద ఈడీ జారీ చేసిన పీఏవో ఉత్తర్వులు పరస్పరం భిన్నమైనవని పేర్కొంది. సీఐడీ జప్తు ఉత్తర్వులపై ట్రయల్ కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు ముందు దాఖలైన వ్యాజ్యాలలో ఈడీ ప్రతివాదిగా లేదని గుర్తు చేసింది. ఈడీ జారీ చేసిన పీఏవో ఉత్తర్వులను రెండో జప్తు ఉత్తర్వులుగా పేర్కొనలేమని తెలిపింది. ఈడీ పీఏవోపై అడ్జుడికేటింగ్ అథారిటీ వద్దే తేల్చుకోవాలని డిజైన్ టెక్ సంస్థకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల తీర్పు ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకి సంబంధించి నిధులు మళ్లింపు ఆరోపణలతో ఏపీ సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసింది. ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న డిజైన్ టెక్ సంస్థ నిధులు పక్కదారి పట్టించిందని ఈడీకి సమాచారం ఇచ్చింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసిన ఈడీ.. డిజైన్ టెక్ సంస్థకు చెందిన రూ.31.20 కోట్లను జప్తు చేస్తూ గత ఏడాది ఏప్రిల్ 21 పీఏవో జారీ చేసింది. డిజైన్ టెక్ సంస్థకు గత ఏడాది జులై 13న అడ్జుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పీఏవో ఉత్తర్వులతో పాటు అడ్జుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తూ డిజైన్ టెక్ సంస్థ ఎండీ వికాస్ వినయ్ ఖన్వీల్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఆర్పీసీ సెక్షన్ 102ను అనుసరించి సీఐడీ ఇప్పటికే తమ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తాము ట్రయల్ కోర్టును ఆశ్రయించగా బ్యాంక్ ఖాతా నిర్వహణకు అనుమతిస్తూ అందులోని సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చాలని ఆదేశించినట్టు తెలిపింది. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేస్తూ ఈడీ పీఏవో ఉత్తర్వులు ఇచ్చిందని డిజైన్ టెక్ పేర్కొంది. ఒకే ఆస్తికి సంబంధించి రెండు జప్తు ఉత్తర్వులు చెల్లుబాటు కావని తెలిపింది. ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈడీ జప్తు చేసిన సొమ్ము.. కేసుకి సంబంధించిన సొమ్ముకాదని అడ్జుడికేటింగ్ అథారిటీ వద్ద నిరూపించుకోవాల్సిన బాధ్యత పిటిషనర్‌పై ఉందన్నారు. అడ్జుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాలన్నారు. పీఏవో ఉత్తర్వులపై నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదని తెలిపారు. సీఆర్పీసీ 102ని అనుసరించి సీఐడీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులు, మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ జారీ చేసిన జప్తు చేసిన ఉత్తర్వులు వేర్వేరని వివరించారు. ఈడీ జప్తు ఉత్తర్వులు రెండో జప్తు కిందికి రావన్నారు. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి ఇటీవల నిర్ణయాన్ని వెల్లడించారు.

ఈ ఉగాది సుఖసంతోషాలు పంచాలి

- రాష్ట్ర ప్రజలకు గవర్నర్, చంద్రబాబు శుభాకాంక్షలు
- ఉగాది తర్వాత రాష్ట్రానికి మంచి రోజులే: పవన్

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది తెలుగు వారంతా సంతోషంగా, ఆనందంగా జరుపుకునే పండుగని, కొత్త సంవత్సరం మన ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని గవర్నర్ ఆకాంక్షించారు. శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ మన సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లో శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాలను పంచాలని కోరుకున్నారు. 'ఈ ఎన్నికల సమయంలో మనందరం తెలుగు నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్నాం. క్రోధి అంటే కోపంతో ఉన్న వారు అని అర్థం. అయితే నేడు మీ ఆగ్రహం.. ధర్మాగ్రహం కావాలి. ఆ ఆగ్రహంలో చెడు అంతా దహనమై, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే చల్లని పాలన మొదలవ్వాలని కోరుకుందాం. ఈ ఉగాది మీ ఇంటిల్లిపాదికీ శుభాలు కలిగించాలి. మీ కుటుంబ సభ్యులకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, అభివృద్ధిని అందించాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు. కాగా, తెలుగు సంవత్సరం ప్రారంభమయ్యే ఉగాది మనందరికీ ఎంతో ప్రత్యేకమైనదని, తెలుగుదనం నిండిన ఈ వేడుకను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. కొత్త చిగురులు వేసే వసంత రుతువు మొదలయ్యేదీ ఈ పర్వదినం నుంచేనని, ఈ ఉగాది తర్వాత నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చేవన్నీ మంచి రోజులే అని ఆకాంక్షించారు. రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త చిగురులు మొదలయ్యాయని, రాక్షస పీడ నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభిస్తుందని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నేడు టీడీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

- హాజరు కానున్న చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీక్రోధి నామ ఉగాది సందర్భంగా మంగళ వారం ఉదయం 10 గంటలకు ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దీనికి హాజరుకానున్నారు. అమరావతికి చెందిన పండిత ప్రముఖుడు, అంతర్జాతీయ జ్యోతిష్య సదస్సులో గౌరవ డాక్టరేట్ పొందిన మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణకర్తగా వ్యవహరించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ ఇక్బాల్, ఎమ్మెల్యే బాబూరావు రాజీనామాలు ఆమోదం

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పార్టీని వీడిన వైసీపీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తన పదవికి కూడా రాజీనామా చేశారు. ఆమేరకు తన రాజీనామా లేఖను ఫాక్స్‌లో శాసన మండలి ఛైర్మన్ కార్యాలయానికి పంపారు. లేఖ ను అందుకున్న వెంటనే మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు దానిని ఆమోదించారు. అలాగే పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను సోమవారం సభాపతి తమ్మినేని సీతారాం ఆమోదించారు. ఆమేరకు అసెంబ్లీ సెక్రటేరియెట్ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

వైసీపీ ఏజెంట్‌గా ధర్మారెడ్డి

- టీటీడీ ఈవో పదవి నుంచి ఆయన్ను తొలగించండి
- సీఈవో మీనాకు టీడీపీ, జనసేన, బీజేపీ ఫిర్యాదు



సీఈవో ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న కొమ్మారెడ్డి పట్టాభి, భానుప్రకాష్‌రెడ్డి

అమరావతి, తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో ధర్మారెడ్డి వైసీపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని, టీటీడీ పవిత్రత కు భంగం కలిగిస్తున్న ఆయన్ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని టీడీపీ, జనసేన, బీజేపీ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ ప్రచారం, అక్రమాలు, నిధుల మళ్లింపు తదితర అంశాలపై టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి, బీజేపీ అధికార ప్రతినిధులు భానుప్రకాశ్ రెడ్డి, సాదినేని యామినీ శర్మ.. సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ధర్మారెడ్డి.. సీఎం జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని, ఆయన వైసీపీ నాయకులకు, నియోజకవర్గాల ఇంచార్జులకు ప్రత్యేక దర్శన కోటా కూడా కేటాయించారని ఆరోపించారు. ఇలా టీటీడీలో గతంలో ఎపుడూ జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీటీడీ బోర్డు ఛైర్మన్ కుమారుడికి మద్దతుగా రూ.1500 కోట్ల పనులకు టెండర్లు పిలిచిందని, టీటీడీ ఛైర్మన్ కోట్లు కొల్లగొట్టి ఆ నిధులను తన కొడుకు పోటీ చేస్తున్న ఎన్నికల్లో ఖర్చు పెడుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ ఏడాది కాలంలో రూ. 1500 కోట్లు సివిల్ వర్కులకు కేటాయించలేదని పేర్కొన్నారు. ధర్మారెడ్డి తరచూ ప్రత్యేక విమానాల్లో ప్రయాణిస్తుంటారని, సంపన్నులతో, పారిశ్రామికవేత్తలతో పరిచయాలు పెంచుకుని వారు వైసీపీకి సహకరించేలా ప్రభావితం చేస్తూ టీటీడీ ఈవో ఉద్యోగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ కోసం ఈవో ధర్మారెడ్డి వందల కోట్లు నిధులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కోడ్ కారణంగా మూడేళ్లకు మించి పనిచేస్తున్న అధికారులంతా బదిలీ కాగా ధర్మారెడ్డి మాత్రం బదిలీ కాలేదని పేర్కొన్నారు. ఆయన ఈవోగా కొనసాగితే అధికార పార్టీకి సహకరిస్తూ ఈ ఎన్నికల్లో తన స్థాయిని దుర్వినియోగం చేస్తారని ఆరోపించారు. ధర్మారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా తిరుమలను వైసీపీ కార్యాలయంగా మార్చారని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి మాట్లాడుతూ.. ధర్మారెడ్డి వైసీపీ ఏజెంట్‌గా మారారని, జగన్ కోసం బడా పారిశ్రామిక వేత్తల నుంచి నిధులు సమీకరించే పనిలో పడ్డారని విమర్శించారు. టీటీడీ నుంచి నిధుల కేటాయింపుపై సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేస్తే అన్ని విషయాలూ బయటకు వస్తాయన్నారు. ధర్మారెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఈవోకి వైసీపీ మీద ప్రేమ ఉంటే వైసీపీ కార్యాలయంలో కకూర్చోవాలన్నారు. అంతేకానీ వారి ప్రయోజనాల కోసం టీటీడీ ఖజానాను ఖాళీ చేయడం తగదన్నారు.

చెట్లు నరికివేతపై చర్యలు తీసుకోండి

- టీడీపీ లీగల్ సెల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా కనిగిరి, తిరుపతి జిల్లా రేణిగుంట పర్యటనల సందర్భంగా పచ్చని చెట్లను నరికి వేశారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాగులూరి హరిబాబు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావుతో కలిసి సోమవారం ఆయన అమరావతి సచివాలయంలో సీఈవో మీనాకు ఫిర్యాదు చేశారు. అనంతరం మన్నవ సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ.. కనిగిరి, రేణిగుంటల్లో జరిగిన మేమంతా సిద్ధం సభల ఏర్పాట్లలో భాగంగా వైసీపీ నాయకుల పర్యవేక్షణలో పోలీసులు, అధికారుల సమక్షంలో జగన్ పర్యటన ప్రాంతాల్లోని చెట్లను నరికివేసి పర్యావరణానికి హాని చేశారన్నారు. దీన్ని నిలువరించకుండా సహకరించిన పోలీసులు, అధికారులపై కేసులు పెట్టి వారి నుంచి నష్టపరిహారాన్ని రాబట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రచారానికి వర్సిటీలను వాడుకుంటూ జగన్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు.

అంబేడ్కర్, ఫూలే విగ్రహాలకు ముసుగులు తొలగించండి

- సీఈవోను కోరిన ఏపీ బీసీ సంక్షేమ సంఘం

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్ కోడ్ పేరిట బీఆర్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నిబంధనలను అమలుచేసే క్రమంలో కొన్నిచోట్ల భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, సంఘం సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు కూడా ముసుగులు వేశారని పేర్కొన్నారు. ఈనెల 11న పూలే జయంతి, 14న అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో ఆ వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఆ విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించేలా ఆదేశాలివ్వాలని సీఈవో మీనాను కోరామని చెప్పారు.

సీఎఫ్ఎంఎస్ పోర్టల్ ఆగడం వల్లే జీతాలు ఆలస్యం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై దేవదాయ శాఖ కమిషనర్ వివరణ

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఉద్యోగులకు జీతాలు నిలిచిన విషయంలో తమ తప్పేమీ లేదని దేవదాయ శాఖ కమిషనర్ వివరణ ఇచ్చారు. 'దేవదాయ శాఖలో నిలిచిన జీతాలు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. మార్చి నెల జీతాలకు సంబంధించిన బిల్లులు మార్చి 25వ తేదీనే పేవోకు సమర్పించామని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన ఇంక్రిమెంట్లు ఎఫ్.ఆర్ 24కు సంబంధించి 26కు మార్పు చేయాలని ట్రెజరీ అధికారులు సూచించగా, అలా మార్పులు చేసి మరోసారి 28వ తేదీన బిల్లులు సమర్పించామన్నారు. మార్చి 29, 30,31 తేదీల్లో సెలవులు కావడం, ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో సీఎఫ్ఎంఎస్ పోర్టల్ పని చేయలేదని తెలిపారు. ఏప్రిల్ 6న సీఎఫ్ఎంఎస్ పోర్టల్ తెరవగానే, కొన్ని శాఖల వారికి జీతాలు చెల్లించారన్నారు. దేవదాయ శాఖకు కూడా ఒకటి, రెండు రోజుల్లో జీతాలు వస్తాయని తెలిపారు.

కూటమి విజయం ఖాయం

- 130కి పైగా అసెంబ్లీ.. 19-23 ఎంపీ సీట్లు
- సీఎం హోదాలో మద్యం వ్యాపారిగా మారాడు
- ఢిల్లీవెళ్లిన ప్రతిసారీ కేసుల గురించే మాట్లాడుకున్నాడు
- తెలంగాణ నేత గోనె ప్రకాశరావు వ్యాఖ్యలు



విజయవాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని తెలంగాణ నేత గోనె ప్రకాశరావు జోస్యం చెప్పారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఆరేడు సంస్థలు చేసిన సర్వే నివేదికలు ఈ విషయం స్పష్టం చేస్తున్నాయన్నారు. విజయవాడలోని కేశినేని చిన్ని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమికి 130కి పైగా అసెంబ్లీ సీట్లు, 19 నుంచి 23 వరకు ఎంపీ సీట్లు వస్తాయని వెల్లడించారు. జగన్ ప్రజారంజకంగా కాకుండా తనకు ఇష్టమొచ్చినట్టుగా పాలన సాగించారని విమర్శించారు. వేసవిలో సన్‌స్ట్రోక్ మాదిరిగానే సీఎంకు వైఫ్ స్ట్రోక్ ఉందన్నారు. వైసీపీని కాపాడుకోవడంలో విజయమ్మ, షర్మిల ఎంతో కీలకంగా వ్యవహరించారని, తీరా అవసరం తీరాక వారిని గెంటేశాడని మండిపడ్డారు. జగన్ జైలుకు వెళ్తే భారతిని సీఎం చేసేలా ప్లాన్ సిద్ధం చేశారన్నారు. భార్య కోసం జగన్ బంధాలు తెంచుకున్నాడన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఊసు లేకుండా పోయిందన్నారు. ప్రజలకు కనీస అవసరమైన రహదారులను నిర్మించలేదన్నారు. 30 మందికి పైగా ఎంపీలు ఉన్న జగన్ ఏనాడూ కేంద్రాన్ని ప్రత్యేక హోదా, ప్రాజెక్టుల గురించి అడగలేదని ఆరోపించారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ తన కేసుల గురించే మాట్లాడుకున్నాడని ధ్వజమెత్తారు. మూడు రాజధానుల అంశం జగన్ చేసిన అతిపెద్ద తప్పిదమని వ్యాఖ్యానించారు. సీఎం హోదాలో జగన్ మద్యం వ్యాపారిగా మారిపోయాడన్నారు. జగన్ చేతకానితనంతో యువతకు ఉపాధి, ఉద్యోగం లేకుండా చేశాడన్నారు. ఈ కారణాలన్నీ జగన్ ఓటమికి మూలకారణమవుతాయని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లో కూటమికి అద్భుత ఫలితాలొస్తాయని, అక్కడి ప్రజలిచ్చే తీర్పు రాష్ట్రం మొత్తం ఉంటుందని గోనె వ్యాఖ్యానించారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం



తిరుపతి(విద్య), ఏప్రిల్ 8: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) వెల్లడించిన సెకండ్ లెవల్ ఫలితాల్లో తిరుపతి జోన్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఏజీఎం జి.సురేష్ పేర్కొన్నారు. న్యూ ఇందిరానగర్‌లోని చైతన్య పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు అందజేశారు. జోనల్ కోఆర్డినేటర్ బాలాజి, కోఆర్డినేటర్ రఘు, ప్రైమరీ కోఆర్డినేటర్ సరస్వతి, జోనల్‌డీన్ కాశీరావు, ప్రిన్సిపాల్స్ అకడమిక్ డీన్లు, టీచర్లు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 8: అకడమిక్ కన్సల్టెంట్ వెంకటేశ్వర రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ విన్నవించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం వీసీని కలిసి సోమవారం వినతిపత్రం అందజేసింది. అక్బర్ మాట్లాడుతూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా ఉన్న వెంకటేశ్వరరెడ్డి ఎస్ఎఫ్ఐని కించపరిచే విధంగా మాట్లాడారని ఆరోపించారు. కమ్యూనిస్టు పార్టీలు అమ్ముడుపోయాయని ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. వెంకటేశ్వరరెడ్డిని తొలగించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వర్సిటీ అధ్యక్షులు నరేంద్ర, కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

15నుంచి వస్త్రాల ఈ-వేలం

తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు టీటీడీ ఈ-వేలం వేయనుంది. కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 335(23541-23552) లాట్లు ఉన్నాయి. ఇందులో ఆర్ట్ సిల్క్ ధోతీలు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, దుపట్టాలు, శాలువలు, బెడ్‌షీట్లు, నాప్‌కిన్స్, హ్యాండ్ కర్చీఫ్‌లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, జంకాళాలు, కార్పెట్లు ఉన్నాయి. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429, టీటీడీతిరుమల.ఓఆర్జీ, కొనుగోళ్లు.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్లను సంప్రదించవచ్చని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.